మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద నిర్మిస్తున్న మెడికల్ కాలేజ్ ముఖద్వారం



ఎప్పటికి పూర్తవుతుందో..?

- మోల్డింగ్‌ల వరకే పనులు
- కేవలం ఆరు నెలలే గడువు
- మదనపల్లె మెడికల్ కాలేజ తరగతులు ప్రారంభమయ్యేనా..?
- ఎన్‌ఎంసీ కమిటీ సమ్మతిస్తుందా..?

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 5: జిల్లాకు కేటాయించిన మదనపల్లె మెడికల్ కాలేజిలో 2024-25 విద్యాసంవత్సరంలో మొదటి బ్యాచ్ తరగతులు ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. ఎన్నికల ముందు తన నీలిపత్రికలో సీఎం జగన్ నవశకం పేరిట ఈ విద్యాసంవత్సరం మదనపల్లె మెడికల్ కాలేజిలో తరగతులు ప్రారంభిస్తామని ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆరు నెలల్లో మెడికల్ కాలేజి భవనాలు పూర్తవుతాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అసలు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) కమిటీ సభ్యులు ఢిల్లీ నుంచి వచ్చింది లేదు.. ఇక్కడ జరుగుతున్న పనులు పరిశీలించనూ లేదు. ఎల్‌వోపీ (లెటర్ ఆఫ్ పర్మిషన్) ఇస్తేనే మెడికల్ కాలేజిలో తరగతుల ప్రారంభానికి, ఎంబీబీఎస్‌లో విద్యార్థుల చేరికకు అవకాశం ఉంటుంది.

ఏడాది ఆలస్యంగా ప్రారంభమైన పనులు

మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద ప్రభుత్వ మెడికల్ కాలేజి నిర్మాణానికి 2022 మే 31వ తేదీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. సీఎం జగన్ వర్చువల్‌గా ఈ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మొత్తం 95.44 ఎకరాల విస్తీర్ణంలో 13,31,825 చదరపు అడుగుల్లో భవనాల నిర్మాణానికి రూ.475 కోట్లు కేటాయించారు. కానీ 2023 మే నెల వరకు ఏడాది సమయంలో కూడా ఇక్కడ కనీసం చదును పనులు కూడా చేయలేదు. దీనిపై ఆంధ్రజ్యోతిలో 2023 మే 4వ తేదీ 'ఏడాది కావస్తున్నా ఇటుక కూడా పడలేదు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీ ఇంజనీర్లు వచ్చి మెడికల్ కాలేజికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి పనులు ప్రారంభించారు. కాగా ఈ ప్రాజెక్టు కాంట్రాక్టు దక్కించుకున్న మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ పనులు ప్రారంభించింది. వాస్తవంగా 2022 జూన్ 1వ తేదీ నుంచి పనులు ప్రారంభించి 2024 నవంబరు 30వ తేదీలోపు 30 నెలల్లో మెడికల్ కాలేజి భవన నిర్మాణాలు పూర్తి చేసే విధంగా అగ్రిమెంట్ ఉంది.

ఈ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేనా..?

రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న విధంగా ఈ ఏడాది 2024-25 విద్యా సంవత్సరం (ఆగస్టు నెల)లో మదనపల్లె మెడికల్ కాలేజిలో మొదటి బ్యాచ్ తరగతులు ప్రారంభిస్తామంటున్నారు. వాస్తవంగా ఇక్కడ 150 సీట్లతో తరగతులు ప్రారంభించాలంటే మెడికల్ కాలేజి భవనాలు, బాలుర, బాలికల హాస్టల్ భవనాలు, ఓపీడీ భవనాలు, 504 పడకల ఆస్పత్రి నిర్మాణం చేయాల్సి ఉంది. కానీ ఇప్పటికిప్పుడే 504 పడకల ఆస్పత్రి నిర్మాణం సాధ్యం కాకపోవడంతో మదనపల్లె పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి భవనాలపై అదనపు పడకల గదులు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 100 పడకల ఆస్పత్రికి అదనంగా మరో 220 పడకల గదులు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు పనులు చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆరోగ్యవరం వద్ద నిర్మిస్తున్న మెడికల్ కాలేజి భవనాలు జీ ప్లస్ త్రీ స్థాయిలో మోల్డింగ్ (స్లాబులు) వరకే పనులు జరిగాయి. అలాగే బాలుర హాస్టల్ జీ ప్లస్ టు, బాలికల హాస్టల్ జీ ప్లస్ టు స్థాయిలో మోల్డింగ్ పనులు మాత్రమే జరిగాయి. ఇంకా గోడల నిర్మాణాలు జరగాల్సి ఉంది. ఇదిలా ఉంటే ఓపీడీ భవనాలు పిల్లర్ స్థాయిలోనే ఉన్నాయి.



గ్రౌండ్ ఫ్లోర్ వరకే పూర్తయిన మెయిన్ హాస్పిటల్ భవనాలు



పిల్లర్ స్థాయిలో జరుగుతున్న ఓపీడీ భవనాల నిర్మాణం



జీ ప్లస్ 2 స్లాబుల వరకు జరిగిన బాలుర, బాలికల హాస్టల్ భవనాలు

ఎన్‌ఎంసీ కమిటీ విజిట్ ఎప్పుడో...?

ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజిల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. నిబంధనల ప్రకారం ఢిల్లీ నుంచి ఎన్‌ఎంసీ కమిటీ వచ్చి స్థానికంగా మెడికల్ కాలేజి భవనాలు, వసతులు, యంత్రాలు, తదితర విషయాలు పరిశీలించాకే ఇక్కడ ఎన్ని సీట్లకు అనుమతి ఇవ్వాలో నిర్ణయిస్తుంది. మదనపల్లెలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజి పనులను పరిశీలించేందుకు ఎన్‌ఎంసీ కమిటీ ఈవారం లోపు రావచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో మెడికల్ కాలేజి భవనాల నిర్మాణానికి నవంబరు 30వ తేదీ వరకు గడువు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీర్లు, కాంట్రాక్టు సంస్థపై ఒత్తిడి పెంచుతోంది. ఈ విద్యా సంవత్సరమే (ఆగస్టు లోపల) మెడికల్ కాలేజి తరగతులు ప్రారంభించాలని దీనికి అనుగుణంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు సమాచారం. నీట్ పరీక్షల నిర్వహణ, ఎంబీబీఎస్ సీట్లకు కౌన్సిలింగ్ తదితర ప్రక్రియ పూర్తయ్యాక సెప్టెంబరు 1 నుంచి తరగతులు ప్రారంభిస్తారని తెలుస్తోంది. ఈ ఆరు నెలల్లో ఆరోగ్యవరం వద్ద మెడికల్ కాలేజి తరగతుల భవనాలు, హాస్టల్ భవనాలు, ఓపీడీ భవనాలు, తదితరాలు పూర్తి చేయాల్సి ఉంది. కాగా మదనపల్లె ప్రభుత్వాస్పత్రి మొదటి అంతస్థులో అదనపు పడకల గదుల నిర్మాణం మాత్రం వేగంగా పూర్తి చేశారని చెప్పవచ్చు. తాత్కాలిక కప్పు (రేకుల షెడ్డు) నిర్మాణం కింద పీవీవోతో గదుల నిర్మాణం పూర్తి చేశారు. దీంతో పాటు ఎలక్ట్రిక్ పనులు, రంగులు కూడా పూర్తిగా వేశారు. ఇంతలోగా ఎన్‌ఎంసీ కమిటీ మదనపల్లెకు వస్తే, ఇక్కడ క్షేత్రస్థాయిలో నిర్మాణాలు, వసతులు పరిశీలిస్తే ఎల్‌వోపీ ఇస్తారా అన్నదే ప్రశ్నార్థకంగా మారనుంది. తొలిసారి కాకపోయినా రెండోసారి అయినా ఎన్‌ఎంసీ కమిటీ పరిశీలనలోపు అన్ని సమకూరుతాయా అన్నది వేచి చూడాల్సి ఉంది.

మెడికల్ కాలేజి నిర్వహణకు ప్రొఫెసర్ల నియామకం

మెడికల్ కాలేజి నిర్వహణకు అవసరమైన 76 మంది ప్రొఫెసర్లకు గాను 48 మంది వివిధ ప్రభుత్వ మెడికల్ కాలేజిల నుంచి పదోన్నతులు, బదిలీలపై మదనపల్లెలో చేరారు. వీరితో పాటు బోధనేతర సిబ్బంది 267 మంది నియామకాలకు గాను నోటిఫికేషన్ విడుదల చేశారు. జనవరి 14వ తేదీ వరకు ఈ ఉద్యోగాలకు 5,750 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఈ దరఖాస్తులను పరిశీలనకు మెంటర్ కాలేజి అయిన తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు ఈ దరఖాస్తులు పంపారు. త్వరలో స్క్రూటినీ తరువాత 267 మంది బోధనేతర సిబ్బంది, 76 మంది ప్రొఫెసర్ల నియామకం పూర్తి చేయనున్నారు.

అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ



సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- స్పందనలో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 5: బాధ్యతగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ, ఎస్డీసీ శ్రీలేఖలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే జగనన్నకు చెబుదాం అర్జీలను ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలన్నారు. పెండింగ్ ఉన్న అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మరో రెండు, మూడు వారాలు మాత్రమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికల కోడ్ రావచ్చునని తెలిపారు. ఈ రెండు, మూడు వారాలు కూడా ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి బాధ్యతగా వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రెవెన్యూ, డివిజన్ మండలాల్లో కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పటిష్ఠంగా ప్రాధాన్యతతో నిర్వహించాలని డివిజన్, మండల అధికారులను ఆదేశించారు. అలాగే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాత్రమే కాకుండా ఏదైనా సమస్యతో ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు వారి నుంచి సమస్యను ఓపికగా ఆలకించాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపకుండా పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వారు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తోలుకున్నోళ్లకు.. తోలుకున్నంత

- మల్లెల ఏటిలో నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 5 : ఎక్కడ ఇసుక ఉంటే అక్కడ దోచేస్తున్నారు ఇసుకాసురులు. మండలంలోని టి.సదుం పంచాయతీ పాపాఘ్ని నదిలో అధికార పార్టీ వారు ఎన్ని వేల టన్నుల ఇసుకను తరలించేశారో లెక్కే లేదు. అదేవిధంగా చోటా నాయకులు మల్లెల పంచాయతీ పరిధిలోని అంకిరెడ్డిపల్లె శివారులో ఉన్న ఏటి నుంచి ప్రతిరోజూ ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడి నుంచి బి.కొత్తకోట కేవలం 5 కిలోమీటర్లే ఉండడంతో ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇంతకు మునుపు బి.కొత్తకోట శివారులోని ఆలేటి వాగు నుంచి ఇసుక రవాణా జరిగేది. ప్రస్తుతం ఈ వాగులో నీరు ప్రవహిస్తుండడంతో ఇసుకాసురుల కన్ను మల్లెలపై పడింది. స్థానిక నాయకులు, రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రతిరోజూ 10 ట్రాక్టర్లు, నాలుగైదు లోడ్లు ఇసుకను తరలిస్తున్నాయి. ఈ ఇసుక ట్రాక్టర్ బి.కొత్తకోటలో రూ.4 వేలు పలుకుతుండడంతో దందా మూడు పువ్వులు ఆరుకాయలు అన్నట్లు నడుస్తోంది. ఈ అక్రమ ఇసుక రవాణా విషయమై స్థానికులు ఫిర్యాదు చేసినా అంతా మనోళ్లే చూసీ చూడనట్లు పోవాలి అని రెవెన్యూ అధికారులు చెబుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై స్థానిక డిప్యూటీ తహసీల్దార్ విద్యాసాగర్‌ను వివరణ కోరగా ఇసుక తోలేవారికి రెవెన్యూ అధికారులు కాపలా ఉండలేరు కదా ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎస్ఈబీ అధికారులు చర్యలు తీసుకోవాలి. 24 గంటలూ ఇసుకకు మేము కాపలా ఉండాలా మేము ఒక్క హౌసింగ్‌కు తప్ప ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. మీరు ఎస్ఈబీ అధికారులను అడగండి అని చెప్పారు.



మల్లెల ఏటిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

100 కేజీల గంజాయి స్వాధీనం

- ఆరుగురి అరెస్ట్.. రెండు కార్లు స్వాధీనం
- పీటీఎం మండల సరిహద్దు సంద్రదవిలో పట్టుబడ్డ నిందితులు

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 5: పీటీఎం, ములకలచెరువు మండలానికి సరిహద్దుగా ఉన్న రాపూరిపల్లె పంచాయతీ కాయలవాండ్లపల్లె సమీపంలోని సంద్రదవి కేంద్రంగా గంజాయిని తరలిస్తున్న స్మగ్లర్లను పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ములకలచెరువు సీఐ మధు, పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంద్రదవి అటవీ ప్రాంతంలో గంజాయిని నిల్వ ఉంచినట్లు సమాచారం అందుకున్న పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు ములకలచెరువు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో రెండు స్టేషన్ల పోలీసులు కలిసి సంద్రదవి ప్రాంతంలో రెండు కార్లలో గంజాయిని తరలించేందుకు సిద్ధం చేస్తుండగా పట్టుకున్నారు. స్మగ్లర్లు మొత్తం 12 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇందులో కాయలవాండ్లపల్లెకు చెందిన నాగరాజు, ఇదే గ్రామం డి.నారాయణపల్లెకు చెందిన బాలాజీ అలియాస్ (బాలు), ఓబులేసు అలియాస్ శాంసంగ్, ఆవుల కొండయ్య అలియాస్ కొండి, అలియాస్ రవి, మదనపల్లె చంద్రాకాలనీకి చెందిన అక్కినపల్లె మల్లికార్జున, బైరిశెట్టి అనిల్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరు గతంలో మదనపల్లె చంద్రాకాలనీలో ఇదే పనిచేస్తూ దాదాపు 2022వ సంవత్సరం నుంచి వీరు వివిధ ప్రాంతాల్లో గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. గతంలో వీరు బెంగళూరులోని ఆర్టీనగర్‌లో కూడా పట్టుబడగా వీరిపై అక్కడ కూడా కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం నాగరాజు అనే వ్యక్తి కర్ణాటక నుంచి మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. వీరిలో మదనపల్లె చంద్రాకాలనీకి చెందిన ఓబులేసు అలియాస్ శాంసంగ్, ఆవుల కొండయ్య అలియాస్ కొండి, అలియాస్ రవి అనే వీరిద్దరి ద్వారా నర్సీపట్నం నుంచి ఇక్కడికి తీసుకొచ్చి మదనపల్లె, బెంగళూరు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల్లో ఆరుగురు మాత్రం దొరికారని, మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి మొత్తం 50 ప్యాకెట్లు కాగా ఒక్కో ప్యాకెట్ 2 కేజీల లెక్కన మొత్తం 100 కేజీలు ఉంటుందన్నారు. దీని విలువ సుమారు 30 లక్షలు ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. కాగా నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.



పట్టుబడ్డ గంజాయి ప్యాకెట్లతో ములకలచెరువు సీఐ మధు, ఎస్ఐ రవీంద్రబాబు, పోలీసులు

మదనపల్లె ఆర్డీవోగా హరిప్రసాద్



మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 5: మదనపల్లె ఆర్డీవోగా హరిప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన ఎంఎస్ మురళి బదిలీ కాగా ఆయన స్థానంలో కర్నూలు ఆర్డీవోగా పనిచేస్తున్న హరిప్రసాద్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో హరిప్రసాద్ మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో వాల్మీకిపురం మండల తహసీల్దార్‌గా పనిచేశానని తెలిపారు. కాగా మదనపల్లె రెవెన్యూ డివిజన్ పుట్టినప్పటి నుంచి వచ్చిన ఆర్డీవోలు, సబ్ కలెక్టర్ల సంఖ్య చూస్తే 162వ ఆర్డీవోగా హరిప్రసాద్ బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు

రైల్వేకోడూరు క్రీడాకారులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 5: వరల్డ్ జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ అండర్-19 ఇంటర్నేషనల్‌కు రైల్వేకోడూరుకు చెందిన షటిల్ క్రీడాకారులు గొబ్బూరి విశ్వతేజ్, అరిగెల భార్గవ్‌రాంలు ఎంపికయ్యారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి మార్చి 3 వరకు డచ్‌లోని నెదర్లాండ్స్‌లో, మార్చి 5 నుంచి 10 వరకు జర్మనీలోని బెర్లిన్‌లో ఇంటర్నేషనల్ పోటీలు నిర్వహిస్తారని, అందుకు తాము ఎంపికయ్యామని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఇరువురు అస్సాంలోని గౌహతిలో శిక్షణ తీసుకుంటున్నామని తెలిపారు. ఈ పోటీలకు ప్రపంచ వ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.



విశ్వతేజ్, భార్గవ్‌రాం

డోర్ కాదు.. వీధి డెలివరీ!

- 15 కార్డుదారులకు ఒకచోట పంపిణీకి సిద్ధం
- వలంటీర్ల సమక్షం తప్పనిసరి
- కొత్త విధానాన్ని వ్యతిరేకిస్తున్న వాహన నిర్వాహకులు

కలికిరి, ఫిబ్రవరి 5: నెలవారీ రేషన్ సరుకులను కార్డుదారుల ఇళ్ల ముంగిటనే అందజేస్తామని చెబుతూ ప్రభుత్వం మూడేళ్ల క్రితం ప్రవేశపెట్టిన డోర్ డెలివరీ పథకం పూర్తిగా నీరుగారింది. పథకం అమలు దగ్గర నుంచి ఏ ఒక్క గుమ్మం ముందు కూడా సరుకులు అందజేసిన దాఖలాలు లేవు. అనుకున్న విధంగా డోర్ డెలివరీ చేపట్టాలని చేసిన ప్రయత్నాలన్నీ వమ్ము కావడంతో ఇక గత్యంతరం లేని పరిస్థితుల్లో చివరికి వీధి డెలివరీకి అధికారికంగానే అనుమతించేందుకు అన్ని రకాల కసరత్తులు పూర్తి చేసి అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో అయితే ఒకే ఒకచోట, పట్టణ ప్రాంతాల్లో నాలుగైదు వీధులు కలిసే కూడళ్ల వద్ద సరుకుల పంపిణీ జరుగుతోంది. వలంటీర్ల సమక్షంలో సరుకుల పంపిణీ జరగాలని ప్రారంభంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు కూడా అమలుకు నోచుకోలేదు. ఈ పథకం పూర్తిగా అభాసుపాలైందని నిర్ధారణకొచ్చిన ప్రభుత్వం కనీసం వీధి డెలివరీ చేసైనా సజావుగా పంపిణీ జరిపించాలనే యోచనతో వివిధ రకాల కసరత్తులు పూర్తి చేసి కొత్త విధానానికి సిద్ధమైంది.

చివరికి వీధి డెలివరీకే ప్రభుత్వం మొగ్గు

డోర్ డెలివరీ విధానం అభాసుపాలు కావడంతో కనీసం వీధి డెలివరీ అయినా సాజావుగా చేయాలని ప్రస్తుతం ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. అయినా వీధి డెలివరీ విధానాన్ని అధికారికంగా కనీసం ఒక క్రమపద్ధతిలో నిర్వహించేందుకు పౌర సరఫరాల అధికారులు నానా తంటాలు పడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో అంత్యోదయతో కలుపుకుని తాజాగా మొత్తం 5,02,853 రేషన్ కార్డులున్నాయి. 1123 చౌకదుకాణాలున్నాయి. అన్ని మండలాల్లోనూ కలిపి 310 ఎండీయూ వాహనాలున్నా యి. జిల్లాలో మొత్తం 8660 మంది వలంటీర్లున్నారు.

వీధి డెలివరీ ఎలా చేస్తారంటే..

జిల్లాలో ఒక్కో వలంటీరు పరిధిలో 50 నుంచి 75 వరకూ రేషన్ కార్డులున్నాయి. వీధుల్లో ఎక్కడెక్కడ రేషన్ పంపిణీ చేయాలో ఆయా వలంటీర్లు గుర్తించాల్సి ఉంది. ఒక్కో వలంటీరు 5 నుంచి 8 స్థలాలను గుర్తించాల్సిందిగా ఆదేశించారు. ప్రతి నెలా పంపిణీ చేసే ఆ ప్రత్యేక స్థలాన్ని జీపీఎస్ ద్వారా లొకేట్ చేసి ఉంచాలి. ఈ లొకేషన్ పరిధిలోకి వచ్చే పది లేక పదిహేను రేషన్ కార్డులను ఈ స్థలం లొకేషన్‌కు మ్యాపింగ్ చేయాలి. ఇవన్నీ సజావుగా పూర్తయిన తరువాత సరుకుల డెలివరీ కోసం సరిగ్గా జీపీఎస్ ద్వారా నిర్ధారించిన స్థలం వద్దనే వాహనాన్ని ఉంచి దాని మ్యాపింగ్‌లో ఉన్న కార్డులకు పంపిణీ చేయాలి. వలంటీర్లు వాహనం వెంబడే ఉండి వాహనం ఉన్న లొకేషన్‌ను నిర్ధారించి అక్కడే పంపిణీ జరిగినట్లు లొకేషన్‌తో పాటు రుజువుగా ఫొటోలు కూడా అప్‌లోడ్ చేయాలి. ఇది పూర్తయిన తర్వాతే వాహనం తరువాత లొకేషన్‌కు వెళ్లాలి. స్థలం లొకేషన్ నిర్ధారణ, దానికి రేషన్ కార్డుల మ్యాపింగ్ మాత్రమే కాకుండా ఏ దినం వాహనం ఆ లొకేషన్‌కు వస్తుంది? ఎన్ని కార్డులకు డెలివరీ చేయాలి? ఆ స్థలం అక్షాంశ, రేఖాంశల వివరాలను వీధి డెలివరీ కోసం వలంటీర్లు సిద్ధం చేసి ఉంచారు. ఈ తతంగమంతా గత ఏడాదే జరగాల్సి ఉన్నా వలంటీర్ల నిరాసక్తత కారణంగా సన్నద్ధత వెనకబడింది.



వ్యతిరేకిస్తున్న ఎండీయూ వాహనదారులు

ఇంతా చేస్తే చివరకు వీధి డెలివరీ విధానం క్రమబద్ధీకరణకు ఎండీయూ వాహనాల నిర్వాహకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వలంటీర్లు గుర్తించిన చోట డెలివరీ చేయడం సాధ్యం కాదనేది వీరి వాదనగా ఉంది. అంతేగాకుండా ప్రతి పది లేదా పదిహేను కార్డుల పంపిణీ తరువాత మరో చోటికి వాహనాన్ని మార్చాలంటే ఎలక్ట్రానిక్ తూచి యంత్రాలను సర్ది పెట్టి మళ్లీ కొత్తచోట అమర్చాలంటే సాధ్యం కాదని కూడా వీరు తేల్చి చెబుతున్నారు. ఇక వలంటీర్ల సమక్షంలో వారి వీలును బట్టి పంపిణీ చేయడం కూడా కుదరదని స్పష్టం చేస్తున్నారు. తాము ప్రతి నెలా వాహనాలు అప్పగించేందుకు సిద్ధపడుతున్నా అధికారులు బతిమాలుతూ సర్దుబాటు చేస్తున్నారని, ఈ స్థితిలో వీధి డెలివరీ విధానం అసలు జరిగే పనికాదని కూడా వాహనదారులు ప్రారంభంలోనే చేతులెత్తేస్తున్నారు. ఈ దశలో డోర్ డెలివరీ కాదు కదా కనీసం వీధి డెలివరీ కూడా ఎలా చేయాలో పాలుపోవడం లేదని అధికారులు తంటాలు పడుతున్నారు.

తొందరపడి.. ముందే పూసింది!

- మామిడి తోటలకు చీడపీడలు
- ఎన్ని మందులు వాడినా కనిపించని పిందె
- వాడిపోయిన రైతుల ఆశలు

పూత దశలోనే మామిడి తోటలను ఆశిస్తున్న తెగుళ్లు రైతులు, వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. డిసెంబరు తొలివారంలోనే పూతతో కళకళలాడిన తోటల్లో నెలలు గడుస్తున్నా పిందె కనిపించక పోవడంతో ఆందోళన తీవ్రమవుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో పూతే లేకపోగా, ఉన్న పూత కూడా తెగుళ్ల కారణంగా రాలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గాలివీడు: నిండుగా పూసిన మామిడి చెట్టు


సంబేపల్లె: పూతకు నోచుకోని మామిడి చెట్టు

గాలివీడు/సుండుపల్లె, ఫిబ్రవరి 5: రాయచోటి నియోజకవర్గంలోని గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం, సంబేపల్లె, రాయచోటి రూరల్ మండలాల్లో దాదాపు 30 వేల ఎకరాల్లో సుండుపల్లె మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 8 వేల ఎకరాలకుపైగా మామిడి తోటలు ఉండగా, అన్ని మండలాల్లో 60 శాతం పైగా ఏపుగా పూత రావడంతో ఈ ఏడాది దిగుబడులు ఆశా జనకంగా ఉంటాయని రైతులు ఆశపడ్డారు. అయితే, వాతావరణంలో ఏర్పడిన విపరీతమైన మార్పులు, పొగ మంచు కారణంగా పూత రాలిపోవడంతోపాటు బంక ఎక్కువై పిందె నిలబడడం లేదు. దీంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయే పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు. కరువు కాటకాల సమయంలో ఆదుకుంటాయనుకున్న మామిడి తోటలతో ఈ సారి కూడా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నష్టపోనున్న రైతులు, వ్యాపారులు

గత ఏడాది కోతల అనంతరం జూన్‌లో కురిసిన వర్షాలకు మామిడి తోటలకు దుక్కులు, ఎరువులు, మందుల పిచికారీకి వేలాది రూపాయలు ఖర్చు చేసినా, పిందె నిలువలేదని రైతులు చెబుతున్నారు. కాగా,వాతావరణ పరిస్థితులు మామిడి తోటలకు అనుకూలంగా ఉన్నాయని భావించిన పలువురు వ్యాపారులు నవంబర్‌లోనే తోటలను కొనుగోలు చేశారు. మరికొంత మంది పూత వచ్చిన తరువాత మామిడి తోటలను కొనుగోలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వారు కూడా తీవ్రంగా నష్టపోయే అవకాశం అధికంగా ఉంది.

అప్రమత్తత తప్పనిసరి

పూత రాకుండా ఉంటే 1 లీటరు నీటికి 10 గ్రాములు 13.045 మల్టీకే మందు, ఆర్క మ్యాంగో మందును లీటరు నీటికి ఐదు గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. ఎండు పుల్లలు కత్తిరించడం, కలుపు నివారణ చర్యలతో నాణ్యమైన దిగుబడి లభిస్తుంది.

- సురేశ్‌బాబు, ఉద్యానశాఖ అధికారి

తెగుళ్లతో తీవ్ర నష్టం



7 ఎకరాల్లో దాదాపు 600 మామిడి చెట్లు ఉన్నాయి. ఏడాదికి రెండు లక్షలకుపైగా ఖర్చు పెడుతున్నాం. మూడేళ్లుగా కనీసం పెట్టుబడి కూడా రాలేదు. ఇలాంటి పూత ఇంతకు ముందు చూడలేదు. వాతావరణ మార్పుల కారణంగా పిందె నిలబడడం లేదు.

- నక్కల యోగాంజుల్‌రెడ్డి

సబ్సిడీలు ఇవ్వాలి



మామిడి సాగుతో కొన్నేళ్లుగా తీవ్రంగా నష్టపోతున్నాం. ఏటికేడు పెట్టుబడి పెరిగిపోతుండగా, కాగా దిగుబడి తగ్గిపోతోంది. ప్రభుత్వం స్పందించి ఎరువులు, పురుగు మందులు, పైపులు, డ్రిప్‌లను కూడా సబ్సిడీపై అందజేసి రైతులను ఆదుకోవాలి.

- పిచ్చయ్య

పూత సరిగా రాలేదు



12 ఎకరాల్లో మామిడి తోట సాగు చేస్తున్నాను. ఒక్క చెట్టుకు కూడా సరిగ్గా పూత రాలేదు. ఒక్కసారి మందు పిచికారీకి సుమారు రూ.80 వేలు, దున్నకానికి 30 వేలు ఖర్చయింది. పూత రాకపోవడంతో మామిడి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

- బాదుల్లా

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, మసి, పక్షికన్ను, బూడిద తెగుళ్ల నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్ మరికోఫ్లైట్ 2 గ్రాములు చొప్పున 2 లీటర్ల నీటిలో వేసి పిచికారీ చేయాలి. పూత దశలో సోకే తెగుళ్లకు బుప్రోజన్, కంటప్, అజాడిరక్టిన్ పిచికారీ చేయడం ద్వారా తెగుళ్ల బారి నుంచి పంటనురక్షించుకోవచ్చు. మంచి దిగుబడులు సాధించవచ్చు.

- నాగమణి, ఉద్యానశాఖ అధికారి

కర్రసాము పోటీల్లో పోరుమామిళ్ల ప్రతిభ


కర్రసాములో రజత పతకాలు సాధించిన పోరుమామిళ్ల చిన్నారులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 5 : నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్కులో ఈ నెల 4 వరకు సౌత్ జోన్ కర్రసాము పోటీలు జరిగాయని ఆలిండియా కర్రసాము అసోసియేషన్ ప్రెసిడెంటు హరి, మాస్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. ఈ పోటీల్లో పోరుమామిళ్ల నుంచి సబ్ జూనియర్స్ విభాగంలో వెంకట తేజ శ్రీనిద్, తన్విక, అయమం, నాగూరుబాషా, అహ్మద్‌లు రజత పతకాలు సాధించారన్నారు.

గండి ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

చక్రాయపేట, ఫిబ్రవరి 5:హుండీలోని కానుకల ద్వారా గండి ఆలయానికి రూ.14, 05,372 ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. సోమవారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. అన్నదానం హుండీ ద్వారా రూ.14,753 నగదు, 8.200 గ్రాముల బంగారం, 520.340 గ్రాముల వెండి వచ్చినట్లు ముకుందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కావలి కృష్ణతేజ, పాలక మండలి సభ్యులు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఏపీజీబీ మేనేజర్ జనార్ధన్, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఏపీజీబీ మేనేజర్ అశోక్‌కుమార్, పోలీసు సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, కళ్యాణకట్ట క్షురకులు పాల్గొన్నారు.

పెద్ద దర్గాను దర్శించుకున్న సినీ హీరో రామ్‌జక్కల


పెద్దదర్గాలో ప్రార్థన చేస్తున్న రామ్ జక్కల

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 5 : ఈఏపీ 04 రామాపురం చిత్ర హీరో రామ్ జక్కల సోమవారం కడప పెద్ద దర్గాను దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను హీరోగా పరిచయమైన మొదటి సినిమాను విజయవంతం చేశారన్నారు. తాను త్వరలోనే తీయబోయే రెండో చిత్రం కూడా విజయవంతం కావాలని ప్రార్థనలు చేశామని తెలిపారు. తాను తీసే రెండో చిత్రం యువతరాన్ని ఆకట్టుకునే కథతో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలిపారు.

విషం తాగి పోస్టుమాస్టర్ ఆత్మహత్య


శివదస్తగిరి మృతదేహం

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 5: విషం తాగి ఓ పోస్టుమాస్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. వైఎస్ఆర్ కడప జిల్లా ఖాజీపేటకు చెందిన ఆలమూరు శివదస్తగిరి (22) రాజంపేట మండలం తాళ్లపాక గ్రామంలో హెడ్‌పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. రోజూ తాళ్లపాకకు వచ్చి విధులు వెళుతుండేవాడు. సోమవారం కూడా తాళ్లపాకలో విధులకు హాజరైన ఆయన మధ్యాహ్నం తరువాత గుండ్లూరు రైల్వే బ్రిడ్జి వద్ద విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు మన్నూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో హెడ్ కానిస్టేబుల్ నందకిషోర్ మృతదేహాన్ని పరిశీలించారు. తాళ్లపాక హెడ్‌మాస్టర్ శివదస్తగిరిగా గుర్తించారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు కారణాలపై విచారణ చేస్తున్నామని మన్నూరు పోలీసులు తెలియజేశారు.

డీఐజీని కలిసిన ఎస్పీలు


డీఐజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీలు సిద్ధార్థ కౌశల్, ఎస్పీ కృష్ణారావు

కడప (క్రైం)/రాయచోటి టౌన్, ఫిబ్రవరి 5 :కర్నూలు రేంజ్ నూతన డీఐజీగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ విజయరావును కడప జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్, అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

కొండాపురం, ఫిబ్రవరి 5: మండలంలోని టి.కోడూరు ముత్యాలమ్మ గుడిలో కిరీటం దొంగిలించిన కేసులో జమ్మలమడుగు కోర్టు సోమవారం ఇద్దరికి ఆరునెలలు జైలు శిక్ష విధించింది. కర్నూలు జిల్లాకు చెందిన బోయ హరికృష్ణ ,జగ్గం పుల్లయ్య ఆరు నెలల క్రితం కిరీటం దొంగిలించినట్లు నేరం రుజువు కావడంతో జమ్మలమడుగు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి వారికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఇందుకు కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ సుబ్బరాయుడును సీఐ వేణుగోపాల్, ఎస్సైలు అభినందించారు.

బియ్యం దుకాణంలో చోరీ

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 5 : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయనగర్‌లో ఉన్న పీసీఎంబీ బియ్యం దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడ్డా రు. దుకాణం తాళం పగుల గొట్టి అల్మారాలోఉన్న రూ.2.40 లక్షలు చోరీ చేశారు. సోమవారం ఉదయం దుకాణం వద్దకు వచ్చిన యజమాని తాళం పగులగొట్టి ఉండడం చూసి లోపలికి వెళ్లి పరిశీలించగా అల్మారాలో దాచిన నగదుతోపాటు, సీసీ కెమెరాల హార్డ్‌డిస్కులు చోరీకి గురైనట్లు తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు దుకాణాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. దుకాణ యజమాని మౌలాలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరిగడ్డి దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చాపాడు, ఫిబ్రవరి 5: బాణసంచా కారణంగా ఎగసిన నిప్పు రవ్వలు పడడంతో మంటలంటుకుని 5.5 ఎకరాల్లో పండిన వరిగడ్డి దగ్ధమైనట్లు ఖాదర్‌పల్లెవాసులు సోమవారం తెలిపారు. ప్రొద్దుటూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. కాలిపోయిన వరి గడ్డి విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందని బాధితుడు నియతుల్లా తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 5 : ఇంటర్మీడియట్ 2024 పరీక్ష రుసుమును జరిమానాతో కలిపి చెల్లించేందుకు ఫిబ్రవరి 10వతేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆర్ఐవో వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి పరీక్ష రుసుముకు అదనంగా రూ.3వేలు ఫిబ్రవరి 10వతేదీ సాయంత్రం 5గంటల్లోపు చెల్లించాలని సూచించారు. అభ్యర్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లూర్దుమాత ఉత్సవాల్లో దివ్య బలిపూజ

కడప (కల్చరల్) ఫిబ్రవరి 5: లోక రక్షకుడైన యేసుక్రీస్తుకు జన్మనిచ్చిన పరిశుద్ధ రాలు లూర్థుమాత అని చెన్నూరు విచారణ గురువు లక్కినేని పీటర్ ప్రభాకర్ కొనియాడారు. మరియాపురం లూర్దుమాత తిరుణాలలో భాగంగా సోమవారం లూర్దుమాత చర్చిలో వేంపల్లి విచారణ గురువు మెల్ల బాలస్వామి దివ్యబలిపూజ సమర్పించగా పీటర్ ప్రభాకర్ లూర్దుమాత సందేశాన్ని వినిపించారు. లూర్దుమాత యేసు ప్రభువుకు జన్మనివ్వడం ప్రపంచంలో అతిపెద్ద అద్భుతమన్నారు. ప్రజలు ఆ తల్లిపై విశ్వాసంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో మరియాపురం విచారణ గురువు ఫాదర్ బిరుసు రాజా, సహాయ గురువు ఫాదర్ అరుణ్, ఫాదర్ గుడిమె దేవసహాయం, ఫాదర్ చిన్నప్ప,తో పాటుగా పలువురు విశ్వాసులు, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

లంచాలిస్తేనే.. ఉద్యోగాలు, బిల్లులు

- డీజిల్ నిధుల దుర్వినియోగం అంటూ ఆరోపణలు
- వాడివేడిగా ఎర్రగుంట్ల కౌన్సిల్ సమావేశం
- నలుగురు కౌన్సిలర్ల రాజీనామా?



రాజీనామా సమర్పిస్తున్న కౌన్సిలర్లు (ఇన్‌సర్ట్) నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ ఆలీ

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 5: లంచాలు ఇచ్చిన వారికే ఉద్యోగాలు, బిల్లులు మంజూరు చేస్తూ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారంటూ ఎర్రగుంట్ల నగర పంచాయతీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పేరుకే తాము ప్రజా ప్రతినిధులమంటూ ఓ దశలో రాజీనామాలు సైతం సమర్పించారు.

ఎర్రగుంట్ల నగర పంచాయతీ చైర్మన్ ఎం. హర్షవర్ధన్ రెడ్డి అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2024-25 కు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులను చదువుతుండగా, గత బడ్జెట్‌లో డీజిల్‌కు కేటాయించిన నిధులు దుర్వినియోగమయ్యాయని కౌన్సిలర్ ఆలీ ఆరోపించారు. డీజిల్ బిల్లులు చూపించిన తర్వాతే బడ్జెట్ వివరాలు చదవాలని పట్టుబట్టారు. ఎంతకూ అధికారులు స్పందించకపోవడంతో కింద కూర్చుని నిరసన తెలిపారు. దీంతో అధికారులు డీజిల్ వినియోగానికి సంబంధించిన బిల్లులు సమర్పించగా, కేవలం ఒక కాంట్రాక్టర్ ఒక ఆటోకు లక్షలాది రూపాయలు క్లైం చేసుకున్నాడని ఆరోపించారు. నచ్చిన వారికి పెద్దపీట వేసి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు లంచాలు తీసుకుని కౌన్సిల్ ప్రమేయం లేకుండానే ఉద్యోగాలు ఇస్తున్నారని కౌన్సిలర్లు ఎరికలరెడ్డి, నాగిరెడ్డి తదితరులు ఆరోపించారు.

● ఎస్సీలమనే చిన్నచూపు:

ఎస్సీ వర్గానికి చెందిన తమను చిన్నచూపు చూస్తున్నారని 1, 2, 3 వార్డుల కౌన్సిలర్లు తేరీసమ్మ, వైస్ చైర్‌పర్సన్ వర్రాచంద్రకళ, భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు లేవని చెబుతూ తమ వార్డులో ఒక్క పని కూడా చేయని అధికారులు లంచాలు తీసుకుని బిల్లులు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ఓ పెట్రోల్ బంకులో రూ.4లక్షలకు దొంగబిల్లులు తేవడాన్ని తాము సాక్ష్యాధారాలతో నిరూపిస్తామన్నారు. కుక్కలు, పందులు పట్టుకోకుండానే బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. ఆబ్కాస్‌లో ఉద్యోగులను తీసుకునే అంశాన్ని తాము ఆమోదించమన్నారు. ఇకవేళ కౌన్సిల్ ఆమోదిస్తే తాము రాజీనామా చేస్తామని హెచ్చరించారు. తమకు న్యాయం జరగని ఈ సభలో తాము ఉన్నా లేనట్లేనంటూ రాజీనామా ప్రకటించారు. తాను సైతం కౌన్సిలర్ ఆలీకూడా వారికి మద్దతు పలికారు. ఇక్కడ జరుగుతున్న అవినీతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని, నిజాలు నిగ్గుతేలుస్తామన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజీ నామా చేసిన వారిని తమ కార్యాలయానికి పిలిపించుకుని చర్చించారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దాంతో వారు తమ రాజీనామాలను వాపసు తీసుకుంటున్నట్లు కౌన్సిలర్లు విలేకరుల సమావేశం నిర్వహించి తెలియజేశారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ప్రభుత్వం

- అంధ, బధిర విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



అంధ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో స్పందన హాల్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఐదుగురు అంధ, బధిర విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.54 వేలు విలువతో మొత్తం రూ2.70 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌ఎలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలుస్తోందన్నారు. ల్యాప్‌టాప్‌లు పొందిన వారు వాటిని సద్వినియోగం చేసుకొనిఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఒక్కొక్క విద్యార్థిని పరిచయం చేసుకున్నారు. తమకు ల్యాప్‌టాప్‌లు అందజేసిన కలెక్టర్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ రావు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్, జిల్లా సిరికల్చర్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఆర్‌వీ కృష్ణకిశోర్ పాల్గొన్నారు.

'స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టండి'


కడప: ప్రజల సమస్యలను వింటున్న అదనపు ఎస్పీ (అడ్మిన్)లోసారి సుధాకర్


రాయచోటి: ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ డాక్టర్ వీవీ రాజ్‌కమల్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5: స్పందన కార్యక్రమంలో అందే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టికి పెట్టాలని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీవీ రాజ్‌కమల్ జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా ప్రధాన కార్యాలయంలో స్పందన (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన 45 ఫిర్యాదులను పరిశీలించి, ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం చేకూర్చాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి పట్ట ప్రకారం పరిష్కారం చూపాలని ఆయా అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్దీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధి నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన స్పందన ఫిర్యాదులను ఆయా పోలీసు అధికారులు పరిశీలించి వెంటనే వాటిపై విచారించి నివేదికలను జిల్లా కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. స్పందన ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.


కడప (క్రైం): ఫిర్యాదులపై సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ (అడ్మిన్)లోసారి సుధాకర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఆయన బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. స్పందన ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దీత సమయంలో వాటిని పరిష్కరించి, న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్‌క్రైంకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో, లేదా టోల్ ఫ్రీ నెంబరు 1930కు ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు సూచించారు.

హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్..?

కడప (క్రైం), ఫిబ్రవరి 5 : కడప తాలుకా పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబులుగా పనిచేస్తున్న వీఎం బాషాను సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఇటీవల గూడూరు గ్రామంలోని ఓ స్థలాన్ని మరికొందరితో కలిసి కబ్జాచేయడంతో బాధితుడు శ్రీనివాస రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీఎం బాషా ఆయన సోదరి, మరొకరితోపాటు సబ్ రిజిస్ట్రారుపై కేసు పోలీసులు నమోదు చేశారు. దీనిపై విచారణ చేసిన ఎస్పీ సిద్ధార్థ కౌశల్ వీఎం బాషాను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. తాలూకా పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో పలువురు బాధితుల నుంచి డబ్బు వసూలు చేశాడని, తమ సమస్యలు పరిష్కరించక పోవడంతో తమ డబ్బులు చెల్లించాలని పలుమార్లు అడిగినా స్పందించకపోవడంతో సోమవారం హెడ్‌కానిస్టేబుల్‌పై వారు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ ఒకరికి తీవ్ర గాయాలు

కడప (క్రైం), ఫిబ్రవరి 5 : కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ సమీపంలో సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో చెమ్ముమియాపేటకు చెందిన సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి సురేష్‌కు అదే ప్రాంతానికి చెందిన చికెన్ దుకాణం రఫి మధ్య కొంతకాలంగా మనస్పర్థలున్నాయి. ఈ క్రమంలో రఫీని మందలించేందుకు సురేష్ తన స్నేహితులతో కలిసి రఫి వద్దకు వెళుతుండగా రఫి తన స్నేహితులతో ఎదురుపడ్డాడు. రెండు వర్గాల వారు ఘర్షణకు దిగారు. ఈ దాడిలో సురేష్ తీవ్ర గాయాలపాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.



ఎంపీడీవోగా సురేంద్రనాథ్



రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5: రాయచోటి ఎంపీడీవోగా సురేంద్ర నాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న మల్‌రెడ్డి బదిలీపై కర్నూలు జిల్లా అవుకు మండలానికి వెళ్లారు. ఈ క్రమంలో జిల్లా పరిధిలోని తంబళ్లపల్లె ఎంపీడీవోగా పనిచేస్తున్న సురేంద్రనాథ్ రాయచోటి నూతన ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవడమే కాక ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు.

సంబేపల్లె ఎంపీడీవోగా...



సంబేపల్లె, ఫిబ్రవరి 5: సంబేపల్లె ఎంపీడీవోగా నిర్మలాకుమారి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన నరసింహులు ఇటీవల పదవీ విరమణ పొందడంతో ఆ స్థానంలో నిర్మలకుమారిని నియమించారు. ఆమె అనంతపురం జిల్లా సింగనమల ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

తహసీల్దార్‌గా శ్రీనివాసులు

సంబేపల్లె, ఫిబ్రవరి 5: నూతన తహసీల్దార్‌గా శ్రీనివాసులు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన నంద్యాల జిల్లా అవుకు తహసీల్దార్‌గా పనిచేస్తూ సంబేపల్లెకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మహేశ్వరి భాయ్ కడప జిల్లా బి.కోడూరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తామన్నారు. కాగా స్థానిక ఎస్‌ఐ పి.రామకృష్ణ తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నిర్వాసితులను ఆదుకోవాలి: సీపీఐ

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: మండలంలోని శ్రీనివాసపురం రిజర్వాయర్ రైతుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా నిర్వాసితుల సమస్య పరిష్కారం కాకుండా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారుల చుట్టూ అనేక సంవత్సరాలు తిరిగినా పరిష్కారం లేదని, వారం రోజుల్లోపు సమస్య పరిష్కారం కాకపోతే మండల కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, నిర్వాసితుల కమిటీ సభ్యులు వెంకటేశ్, శ్రీనివాసులు, కుమార్ పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోండి

రామాపురం, ఫిబ్రవరి 5: రబీ సీజన్-2023లో పంటలు సాగు చేసిన రైతులు తమ పంటలను ఈ నెల 15వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారిణి నాగమణి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన పెంచుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 5: ఆహార సంరక్షణ ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన పెంచుకోవాలని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ సభ్యురాలు వీర పద్మజ, పీఈటీ నిర్మళ, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంతమ్మ భౌతికకాయానికి నివాళులు

చిన్నమండెం, ఫిబ్రవరి 5: మండలంలోని దిగువగొట్టివీడు గ్రామ పంచాయతీలోని హరిజనవాడలో చాకిబండ అశోక్ తల్లి కాంతమ్మ గుండెపోటుతో మరణించింది. ఈ విషయం తెలుసుకున్న టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు వెళ్లి భౌతిక కాయానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొజ్జా వెంకట్రమణ, మాజీ ఎంపీటీసీ ప్రతాప్‌నాయుడు, కాంట్రాక్టర్ దేవగోపాల్‌నాయుడు, నాగేశ్వరరావు, హనుమంతునాయుడు, వార్డు మెంబర్ రెడ్డెప్ప, వెంకట్రమణ, కె.అశోక్, పెద్దరమణ, చిన్నరమణ, మనోహర్, మన్నేరురామాంజులు తదితరులు నివాళులు అర్పించారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రామచంద్రారెడ్డి

వీరబల్లి, ఫిబ్రవరి 5: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ రామచంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎంపీడీవో మల్లీశ్వరి బదిలీపై కర్నూలుకు వెళ్లారు. నూతన ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో తమకు సంబంధించి ఎటువంటి సమస్య అయినా పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొడదాం

● కస్తూరి విశ్వనాథనాయుడు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

చిట్వేలి, ఫిబ్రవరి 5: రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న దుర్మార్గ ప్రభుత్వాన్ని, టీడీపీ జనసేన నాయకులు తరిమికొట్టాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం చిట్వేలిలో టీడీపీ కార్యాలయాన్ని మండల అధ్యక్షుడు కె.కె.చౌదరి, జనసేన రాష్ట్ర ప్రతినిధి తాతంశెట్టి పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడుతో కలిసి ప్రారంభించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వందలాది మంది యువతతో కలిసి బైక్ ర్యాలీతో కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జయహో బీసీ కార్యక్రమంలో బీసీ నాయకులు కమటం నాగరాజు మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, రాబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. జనసేన నాయకుడు నాగేంద్ర మాట్లాడుతూ కల్లిబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను దోచుకుంటున్నారన్నారు. జనసేన, టీడీపీ మధ్య చిచ్చులు పెట్టడానికి జగన్‌రెడ్డి పావులు కదుపుతున్నారని, ప్రజలు వీటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాయలసీమ జోన్-1 కన్వీనర్ జోగినేని మణి మాట్లాడుతూ అరాచక పాలనకు అంతమయ్యే సమయం ఆసన్నమైందని, గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కష్టపడాలన్నారు. కస్తూరి విశ్వనాథం నాయుడు మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రుల శ్రేయస్సు కోసం టీడీపీ, జనసేన ఉమ్మడి కార్యాచరణ ఏర్పాటైందని, ప్రతిఒక్కరూ గెలుపే లక్ష్యంగా పనిచేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విశ్వేశ్వరనాయుడు, బీసీ నాయకులు నాగరాజు, గుండాలయ్య యాదవ్, బాలకృష్ణ, జనసేన నాయకులు జోగినేని మణి, పగడాల వెంకటేష్, మాదాసు నరసింహ, మహిళా నేతలు అనితాదీప్తి, రేవతి, టీడీపీ నాయకులు కొమ్మా శివ, చిన్నరాయుడు, రాజశేఖర్, కట్టా లోకేష్, ఏదోటి రాజశేఖర్, లాయర్ బాలాజీ, సుబ్రమణ్యం యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పెంచలయ్య, రవీంద్ర రాజు, మహిళా నేతలు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలకు తావివ్వొద్దు

వీరబల్లి, ఫిబ్రవరి 5: అవాంఛనీయ సంఘటనలకు తావివ్వొద్దని రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్ అన్నారు. మండలంలోని దూళ్ల హరిజనవాడ గ్రామంలో రెండు వర్గాల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ఈ విషయాన్ని సీఐ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా ఇరువర్గాలు కలిసి మెలిసి ఉండాలన్నారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని ఆ గ్రామస్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వీరబల్లి ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలి

- ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళా సమాఖ్య సభ్యురాలు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తున్నామని హంగు, ఆర్భాటంగా ప్రచారాలు చేస్తున్నారని, మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 1200 మంది అర్హులు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నా ఏ ఒక్కరికీ మంజూరు కాలేదన్నారు. అనంతరం కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా సహాయ కార్యదర్శి అరుణ, సుబ్బమ్మ, మహిళా సమాఖ్య పట్టణ నాయకురాలు సాదకున్, నసీబ్‌జాన్, స్వప్న, లక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మదనపల్లి వాసులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: మదనపల్లె మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడడమే కాకుండా కౌన్సిల్ సమావేశాన్ని తప్పుదోవ పట్టించిన మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన (బీవైఎస్) మదనపల్లె ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ ఈ విషయంపై పూర్తి విచారణ జరిపించి మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సొంత చెల్లిని గౌరవించలేని వ్యక్తి ఏపీ సీఎం

● జనసేన నియోజకవర్గ నేత శ్రీనివాసరాజు



ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

సుండుపల్లె, ఫిబ్రవరి 5: సొంత చెల్లిని గౌరవించలేని వ్యక్తి మహిళలకు ఏం న్యాయం చేస్తారని రాజంపేట జనసేన నియోజకవర్గ నేత శ్రీనివాసరాజు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత చెల్లెలిని వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు విమర్శిస్తున్నా ఖండించకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కాకుండా కేవలం సీఎం పదవి కోసం జగన్‌మోహన్‌రెడ్డి ఆరాటపడుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాజా, రామశ్రీనివాస్, సలీం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో శేఖర్ నాయక్

నందలూరు, ఫిబ్రవరి 5: మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గా బుక్కే శేఖర్ నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గాలివీడులో ఈవోపీఆర్‌డి, ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఏవో అనంతప్రకాష్, ఏపీవో డిల్లీ బాబు, జూనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, టైపిస్ట్ అర్జున్ ఆయనకు స్వాగతం పలికారు. బీసీ నాయకులు పల్లుణ యాదవ్, నందలూరు భాస్కర్‌రెడ్డి, మండల అభివృద్ధి అధికారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆడపూరు పంచాయతీ సెక్రటరీ నరసింహులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చాకిబండలో క్రికెట్ టోర్నమెంట్

చిన్నమండెం, ఫిబ్రవరి 5: మండలంలోని టి.చాకిబండ కస్పాలో రాయచోటి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్‌ను గత నెల 20న ప్రారంభించారు. ఇందులో దాదాపు 20 టీంలు పోటీ పడగా ఫైనల్‌గా ఆదివారం చిన్నమండెం మండలానికి చెందిన రెండు టీంలు ఫైనల్‌కు చేరుకొని తలపడ్డాయి. ఇందులో చిన్నమండెం-1కు మొదటి బహుమతి రూ.30 వేలు, చిన్నమండెం-2టీంకు ద్వితీయ బహుమతి రూ.20 వేలతో పాటు ప్రోత్సాహకాన్ని రమేశ్‌రెడ్డి ఆదేశానుసారం ఖాదర్‌వలి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు అమానుల్లా, హర్షద్, ఖాదర్‌బాషా, నియామత్, అల్లాబకాశ్, చిన్నపాపిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోంగార్డులకు ఘన సన్మానం



హోంగార్డులను సన్మానిస్తున్న ఏఎస్పీ రాజ్‌కమల్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5: ఎస్పీ డి.కృష్ణారావు ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పదవీ విరమణ చేస్తున్న ఇద్దరు హోంగార్డులకు ఏఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్ ఆత్మీయ వీడ్కోలు పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామాపురం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ నేడు పదవీ విరమణ పొందిన కేవీ లక్ష్మమ్మ, మదనపల్లె ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేస్తున్న జాఫర్ దంపతులకు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఏఆర్ ఆర్‌ఐ అడ్మిన్ పెద్దయ్య, పోలీసులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5: ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు. సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారి దివాకర్‌బాబు, అర్బన్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ శివశంకర్‌రాజు, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది రాయచోటి పట్టణంలోని పోలింగ్‌స్టేషన్ 87, 88, 90, 91 పరిధిలో గల ఓటర్లను నేరుగా కలిసి విచారించారు. ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని, ప్రతిఒక్కరూ సమాజం మంచి మార్గంలో నడిచే విధంగా ఆలోచించాలన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, ఫిబ్రవరి 5: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కడప డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ పి.బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ లత ఆధ్వర్యంలో వచ్చే నెల తొమ్మిదిన జరగబోవు జాతీయ లోక్ అదాలత్ సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు, పోలీసులు, పీఎల్‌వీలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సాయినగర్‌లో చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

రాజంపేట,ఫిబ్రవరి 5: గంటా చారిటబుల్ ట్రస్ట్ అధినేత రాజంపేట టీడీపీ నేత గంటా నరహరి ఆధ్వర్యంలో రాజంపేట పట్టణం సాయినగర్‌లో సోమవారం సాయంత్రం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రతినిధులు ప్రసాద్, మహేష్, టీడీపీ మహిళా నేత సౌందర్యలహరి, మైనార్టీ నేత మహమ్మద్ ఇషాక్, రాష్ట్ర వాణిజ్య విభాగం సెల్ సంయుక్త కార్యదర్శి ఉగ్రవీంద్ర, ఆర్యవైశ్య సంఘ నాయకులు సునీల్‌శెట్టి, టీడీపీ యువనేత సంతోష్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన సాధికార కమిటీ సమావేశం

రాజంపేట, ఫిబ్రవరి 5: రాజంపేట మండలం అప్పారాజుపేట గ్రామంలో టీడీపీ, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో కుటుంబ సాధికార కమిటీ సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు, స్థానిక జనసేన నేతలతో కలిసి నిర్వహించారు. అప్పారాజుపేటలో ఎన్నికల పోలింగ్ బూతు వారీగా చేపట్టిన కుటుంబ సాధికార కమిటీ కార్యక్రమాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమితో విజయం తథ్యమన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టరేట్ వద్ద పుల్లంపేట టీడీపీ నాయకులు

పుల్లంపేట, ఫిబ్రవరి 5: మండలంలో 8వ విడత భూ పంపిణీ పేరుతో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను కాపాడాలని మండల టీడీపీ ఇన్‌చార్జి సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిజమైన అర్హుల పేర్లతో కొందరు దోచుకునేందుకు సిద్ధమయ్యారన్నారు. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములపై అధికార పార్టీ నాయకులు కన్నేశారని, వాటిని కాపాడాలని ఆందోళనలో పేర్కొన్నారు. మండలంలోని వత్తలూరు అనంతసముద్రం రెవెన్యూ గ్రామాల్లో అనర్హుల పేర్లతో జాబితా సిద్ధం చేయడంతో హైకోర్టులో కేసు వేసి స్టే తెచ్చినట్లు టీడీపీ నాయకులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముద్దా గంగిరెడ్డి, కేవీఎస్ యాదవ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ అండ్ డ్రైవ్ నేరం : ఎస్‌ఐ

నందలూరు, ఫిబ్రవరి 5: మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఆయన ఆర్‌ఎస్ రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమని, ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శంకర్ నాయక్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి భేటీ



చంద్రబాబుతో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

రాజంపేట, ఫిబ్రవరి 5: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుతో టీడీపీ నేత, ప్రముఖ దంత వైద్యుడు నేలటూరి మధుసూదన్‌రెడ్డి భేటీ అయ్యారు. సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. అవకాశం వస్తే తనకు ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వాలని కోరారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, పార్టీ విజయానికి రాజంపేట, కడప నియోజకవర్గాల్లో పర్యటించి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాగా ఈయన కడప నగరంలో ఐడెంటిటీ డెంటల్ కేర్ హాస్పిటల్‌ను నిర్వహిస్తూ ప్రజలకు దంత వైద్యసేవలు అందిస్తున్నారు.

సర్పంచుల అక్రమ అరెస్టు దారుణం

● సర్పంచుల సంఘం రాష్ట్ర నాయకులు పల్లపు వాసు



గాలివీడులో పార్థసారధిరెడ్డిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5: తమ గ్రామాల అభివృద్ధి, సర్పంచుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించమని కోరుతూ 6న ఛలో అసెంబ్లీకి ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘాలు పిలుపునిచ్చిన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి సర్పంచులను గృహ నిర్బంధం చేయడం అన్యాయమని ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి, పెమ్మాడపల్లె సర్పంచ్ పల్లపు వాసు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ దమన నీతిని, నియంతృత్వాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

గాలివీడు: తమ గ్రామాల అభివృద్ధి, సర్పంచుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించమని కోరుతూ 6న ఛలో అసెంబ్లీకి ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘాలు పిలుపునిచ్చిన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి సర్పంచులను గృహ నిర్బంధం చేయడం అన్యాయమని ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి, పూలుకుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. ఆయనను సోమవారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

లక్కిరెడ్డిపల్లె: రాష్ట్ర సర్పంచుల సంఘం పిలుపు మేరకు చలో అసెంబ్లీకి వెళుతున్న కోనంపేట సర్పంచు లక్ష్మీనారాయణ, దప్పేపల్లె సర్పంచు దాసరి కేశవయ్య మరి కొంత మంది సర్పంచులను సోమవారం పోలీసుల అదుపులో ఉంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం అసెంబ్లీని ముట్టడిస్తుంటే అరెస్టు చేయడం సీఎంకు తగదన్నారు.

'ప్రజల వద్దకు సూపర్ సిక్స్ హామీలు'

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 5: ప్రజల వద్దకు టీడీపీ సూపర్ సిక్స్ హామీలు తీసుకెళుతున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మా శివ, పట్టణ అధ్యక్షుడు పోకల మణిలు తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు పట్టణంలో టీడీపీ ఇంటింటికి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు సీఎం కావడం, టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని తెలిపారు. వైసీపీ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకునిపోవడమే లక్ష్యంగా పెట్టుకుని ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నార్జాల హేమరాజ్, ఆనంద్‌యాదవ్, కస్తూరి కోటేశ్వరచౌదరి, జనసేన నాయకుడు శివకుమార్, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పులేల రమేష్, మహిళా నాయకురాళ్లు సుశీలమ్మ, మంజులమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కమాండెంట్‌గా రవిశంకర్ బాధ్యతలు



కమాండెంట్ రవిశంకర్

సిద్దవటం, ఫిబ్రవరి 5: మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న 11వ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంటుగా రవిశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 11వ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంటుగా పనిచేస్తున్న శ్రీనివాసులు కర్నూలు 2వ బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న రవిశంకర్ 11వ బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమాండెంటు మాట్లాడుతూ బెటాలియన్ అభివృద్ధికి, సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీఎస్‌డీ ప్రసాద్, డీఎస్పీ జయప్రసాద్, ఆర్‌ఐలు శ్రీనివాసరావు, అలీ బాషా, రంగారావు, సీఆర్‌కె రాజు, దానయ్య, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో అన్నదానం

సుండుపల్లె, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలోని బస్‌షెల్టర్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో 250 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో రాజంపేటలోని అన్ని మండల కేంద్రాల్లో రెండు రోజుల అన్నదాన కార్యక్రమం రాష్ట్ర బీజేపీ కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్నట్లు బీజేపీ కిసాన్‌మోర్చ జోనల్ ఇన్‌చార్జి వెంకటరామరాజు తెలిపారు. అందులో భాగంగా సోమవారం మండల కేంద్రంలో బస్‌షెల్టర్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చ జోనల్ ఇన్‌చార్జి వెంకటరాజు బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కొండూరు లోకేశ్ కుమార్‌రాజు, జిల్లా యువ మోర్చ కార్యదర్శి మండల యువనాయకులు వంశీ, రాజు, మండల నాయకులు హాజరయ్యారు.

'ఓట్ల కోసమే నోటిఫికేషన్ డ్రామా'

వీరబల్లి, ఫిబ్రవరి 5: నిరుద్యోగులను మభ్య పెట్టేందుకే సీఎం జగన్‌మోహన్ రెడ్డి తూతూ మంత్రంగా డీఎస్సీ విడుదల చేస్తున్నారని టీఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్, తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డిలు సీఎం జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. ప్రతియేటా 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తానన్న జగన్‌రెడ్డి హామీ ఏమైందో సమాధానం చెప్పాలన్నారు. కేవలం పది రోజుల్లో ఎలెక్షన్ నోటిఫికేషన్ వస్తుందనగా కేవలం 6,100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు ఆంజనేయులు, రామకృష్ణంరాజు, సుబ్బరామయ్యతో పాటు నాయకులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నందలూరు, ఫిబ్రవరి 5: అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లలో ఆర్‌కె ఒలంపియాడ్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన శ్రీ అన్నమాచార్య అకాడమి హైస్కూలు విద్యార్థులను పాఠశాల కరస్పాండెంటు సమ్మెట శివప్రసాద్ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడూరులో ఆదివారం జరిగిన పోటీలలో 17 పాఠశాలలో 400 మంది విద్యార్థులు పైగా పోటీ పడగా మండలం నుండి తమ పాఠశాల విద్యార్థులు 21 మంది పోటీలలో పాల్గొన్నారని వారిలో 8 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో ఇద్దరు, ద్వితీయ స్థానంలో ముగ్గురు, తృతీయ స్థానంలో ముగ్గురు విజేతలుగా నిలిచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగుల బాలాంజనేయులు, డైరెక్టర్స్ మాడపూరి హేమలత, ఉమామహేష్, ఉపాధ్యాయులు షఫీఉల్లా, స్రవంతి, లక్ష్మీ, ప్రియాంక, శివకుమారి, గోపి తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 5: రాజంపేటలో జరిగే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కడప సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. సోమవారం రాజంపేట సబ్‌జైల్‌లో ఖైదీలను పరామర్శించి వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. తదనంతరం రాజంపేట న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో సమావేశమయ్యారు. వచ్చే నెల 7న జరిగే లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, ఏపీపీ రెహనారసూల్, న్యాయవాదులు కృష్ణకుమార్, లక్ష్మీనారాయణ, సుదర్శన్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, వెంకటస్వామి, కరుణాకర్‌రాజు పాల్గొన్నారు.

రైతులంటే ఎందుకింత నిర్లక్ష్యం!

- రూ.కోట్లలో ఆదాయం.... కనీస వసతులు మాత్రం ఉండవు
- టమోటాలు అమ్ముకునేందుకు వస్తున్న రైతులకు చుక్కలు
- ములకలచెరువు వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు గుక్కెడు తాగునీరు కరువే

ములకలచెరువు, ఫిబ్రవరి 5: ఆరుగాలం ఎంతో కష్టపడి పండించిన టమోటాలను విక్రయించుకునేందుకు వస్తున్న రైతులకు ములకలచెరువు వ్యవసాయ మార్కెట్‌లో చుక్కలు కన్పిస్తున్నాయి. ప్రస్తుత అధికార వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయ మార్కెట్‌లో అన్నదాతలకు కనీస వసతులు కరువయ్యాయి. రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి ఎంతో చేస్తున్నామని ఊదరగొడుతున్న వైసీపీ ప్రభుత్వం చేతల్లో మాత్రం చూపడం లేదు. రైతుల సంక్షేమం ఏమో గానీ ములకలచెరువు వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు కనీస తాగునీటి వసతి కూడా లేదు. గుక్కెడు నీరు కరువై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ మార్కెట్ ద్వారా ప్రతి ఏటా ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. అయితే తాగునీటి వసతి కల్పించేందుకు పాలకులకు సమయం ఉన్నట్లుగా లేదు. గత మూడేళ్లుగా మార్కెట్‌లో ఈ పరిస్థితి నెలకొన్నా పట్టించుకునే పాలకులు కరువయ్యారు. మదనపల్లె మార్కెట్ తరువాత అతి పెద్దదిగా పేరొందిన ములకలచెరువు మార్కెట్‌ను పాలకులు గాలికి వదిలేశారన్న విమర్శలు విన్పిసున్నాయి. అలాగే మార్కెట్‌లో పలు సమస్యలు నెలకొన్నా పరిష్కరించే వారే లేరు.

తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి వ్యవసాయ మార్కెట్ యార్డు ములకలచెరువులో ఉంది. దీనిని 1977లో ప్రారంభించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలతో పాలు శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలోని పలు గ్రామాల నుంచి రైతులు టమోటాలు విక్రయించేందుకు ఇక్కడికి తీసుకొస్తారు. ప్రతిరోజూ వందలాది మంది రైతులు మార్కెట్‌కు వచ్చి వెళతుంటారు. సీజన్‌లో అయితే సంఖ్య రెట్టింపుగా ఉంటుంది. స్థానిక మార్కెట్ నుంచి ప్రతిరోజూ ఇతర రాష్ట్రాలకు టమోటాలు తీసుకెళ్లే వాహనాల సెస్సులు, ములకలచెరువు, బురకాయలకోటలలోని చెక్‌పోస్టులు, ములకలచెరువులోని వాణిజ్య గదుల ద్వారా అధిక ఆదాయం వస్తుంది. మార్కెట్ కమిటీ ద్వారా ప్రభుత్వానికి ప్రతి ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తుంది. గత ఏడాది మార్చి 31 నుంచి ఇప్పటి వరకు రూ.1.20 కోట్లు ఆదాయం వచ్చింది. ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నా మార్కెట్‌లో కనీస వసతులు కల్పించిన పాపాన పోలేదు. కనీసం రైతులకు తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదు. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు


మార్కెట్‌లో మూతపడ్డ తాగునీటి వాటర్ ప్లాంటు

మూడేళ్లుగా మూతపడింది. దీంతో తాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి టమోటాలు తీసుకొస్తున్న రైతులకు విశ్రాంతి తీసుకునేందుకు భవనం లేదు. మరుగుదొడ్లు దూరంగా ఉండడంతో వినియోగంలో లేక అవస్థలు తప్పడం లేదు. రైతులు పండించిన పంటలు ఆరబెట్టుకోవడానికి డ్రైయింగ్ ప్లాట్ ఫారం కూడా లేదు. సరైన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో చేసేది లేక మండీ యజమానులే విద్యుత్ దీపాలు అమర్చుకున్నారు. వర్షం వస్తే టమోటా మార్కెట్ నిర్వహణ కష్టంగా మారుతోంది.


వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణం

రెండేళ్లుగా పిల్లర్లకే పరిమితం

ముంబాయి-చెన్నై జాతీయ రహదారి పక్కనున్న మార్కెట్ కమిటీ వాణిజ్య గదుల నిర్మాణం రెండు సంవత్సరాల నాలుగు నెలలుగా పిల్లర్లకే పరిమితమైంది. 2021 అక్టోబరులో మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అప్పట్లో మార్కెటింగ్ శాఖ 15 వాణిజ్య గదుల నిర్మాణానికి రూ.60 లక్షలు, సిమెంటు రోడ్ల నిర్మాణానికి రూ.1.20 కోట్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, క్యాంటీన్ నిర్మాణానికి రూ.77 లక్షలు మంజూరు చేసింది. ఇందులో కేవలం వాణిజ్య గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. మిగిలిన పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదు. వాణిజ్య గదుల నిర్మాణం కూడా మొదటి దశ కూడా పూర్తి కాలేదు. అసంపూర్తిగా ఉన్న పనులకు పిల్లర్లు నిదర్శనంగా ఉన్నాయి. నిధులు ఉన్నా పనులు జరగకపోవడం పాలకుల అసమర్థతకు అద్దం పడుతోంది.

ముగిసిన పాలకవర్గ పదవీ కాలం

ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీ కాలం ముగిసింది. గత ఏడాది డిసెంబరు 20వ తేదీకి పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీఎం త్యాగరాజును పర్సన్ ఇన్‌చార్జిగా నియమించింది. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఎన్నికల కోడ్ అమలైతే కొత్త పాలకవర్గం నియమించే అవకాశాలు ఉండవు. దీంతో ఎన్నికల కోడ్ ముందే కొత్త పాలకవర్గం నియామకం జరుగుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది. కాగా మార్కెట్ కమిటీకి ఇన్‌చార్జి కార్యదర్శే దిక్కుగా మారారు. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఏడాదిగా రెగ్యులర్ కార్యదర్శిని నియమించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

తాగునీరుకు కూడా దిక్కు లేదు



మార్కెట్‌లో తాగునీరుకు కూడా దిక్కు లేదు. దాహం వేస్తే నీటి కోసం సమీపంలో ఉన్న దుకాణాల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. మరుగుదొడ్డు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్ ఆదాయం ఉన్నా సమస్యలు పరిష్కరించలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు విశ్రాంతి తీసుకునేందుకు భవనం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తాగునీటి సౌకర్యమైనా కల్పించాలి.

- చిన్న నరసింహులు, రైతు, పులికల్లు, పెద్దతిప్పసముద్రం మండలం

కాంట్రాక్టరుకు నోటీసులు ఇచ్చాం



వ్యవసాయ మార్కెట్‌లో పనులు చేపట్టని కాంట్రాక్టరుకు నోటీసులు జారీ చేశాం. అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. వాణిజ్య గదుల నిర్మాణం ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపేశారు. నిధులు ఉన్నా పనులు ప్రారంభించలేదు. కాంట్రాక్టర్‌కు చివరి నోటీసు జారీ చేసి తిరిగి ప్రతిపాదనలు పంపడానికి చర్యలు తీసుకున్నాం. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాము.

- జగదీష్, మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి, ములకలచెరువు



ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం


పిల్లర్లకే పరిమితమైన వాణిజ్య గదుల నిర్మాణం

ప్రజల సౌకర్యాలు పట్టవా..


వాల్మీకిపురంలోని గాంధీ బస్టాండ్ ప్రాంతం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 5: వాల్మీకిపురం పట్టణంలోని గాంధీ బస్టాండ్ ప్రాంతం సమస్యలకు నిలయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో బస్‌షెల్టర్ లేక రోడ్డుపైనే నిలబడి ప్రయాణికులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వ అధికారులు మాత్రం ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ కనీసం మరుగుదొడ్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల మహిళలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే ప్రాంతంలో పురాతన గ్రామ చావిడి ప్రాంతంలో ప్రభుత్వ గ్రామ స్థలం ఉండి గతంలో ఎన్నోసార్లు బస్టాండ్ ప్రాంతంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గాంధీ బస్టాండ్ ప్రాంతంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరుగుదొడ్లు లేక ఇబ్బందులు..

గాంధీ బస్టాండ్ ప్రాంతం నిత్యం ప్రయాణికుల రద్దీ, వ్యాపారాలతో జనం కూడా ఎక్కువగా ఉంటారు. బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి. ప్రభుత్వ స్థలం ఉన్నా అధికారులకు పలుమార్లు విన్నవించినా సమస్య మాత్రం అలాగే ఉంది. ఇప్పటికైనా స్పందించాలి.

-రఘురామ్, వ్యాపారి, వాల్మీకిపురం.

సమస్యను పరిష్కరిస్తాం..

గాంధీ బస్టాండ్ ప్రాంతంలో మరుగుదొడ్ల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం. మరుగుదొడ్లు, నీటి వసతి కల్పించి సమస్యను పరిష్కరించేలా చూస్తాం.

-ఫిరోజ్‌ఖాన్, తహసీల్దార్, వాల్మీకిపురం.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ప్రభుత్వం

అంధ, బధిర విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 5: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో స్పందన హాల్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఐదు మంది అంధ, బధిర విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.54 వేలు విలువతో మొత్తం రూ.2.70 లక్షల విలువైన చదువుకోవడానికి ఉపయోగపడే సాఫ్ట్‌వేర్ కలిగిన ల్యాప్‌టాప్‌లను జిల్లా కలెక్టర్ ఉచితంగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా పేద ప్రజలను ఆదుకుంటుందని, అలాగే విభిన్న ప్రతిభావంతులకు కూడా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తూ అండగా నిలుస్తోందన్నారు. ల్యాప్‌టాప్‌లు పొందిన వారు పట్టుదలగా కృషితో బాగా చదువుకొని వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఒక్కొక్క విద్యార్థిని పరిచయం చేసుకొని వారికి అమూల్యమైన సలహాలను అందజేశారు. తమకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందజేసిన కలెక్టర్‌కు ఈ సందర్భంగా విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్, జిల్లా సిరికల్చర్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఆర్‌వీ కృష్ణకిశోర్ పాల్గొన్నారు.



అంధ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

అట్రాసిటీ కేసులపై నిర్లక్ష్యం తగదు

మదన పల్లె అర్బన్, ఫిబ్రవరి 5: అట్రాసిటీ కేసులను నిర్లక్ష్యం చేయరాదని మాలమహానాడు అధ్యక్షుడు యమల సుదర్శనం అన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికిరిలో దళితులపై దాడి కేసుల్లో ప్రధాన నిందితుడు అవినాష్‌రెడ్డి, వాళ్ల అనుచరులను అరెస్టు చేయడంలో నిర్లక్ష్యం తగదన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాయలసీమ గౌరవాధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షుడు గుండాల, మాల విభాగ అధ్యక్షుడు నరేష్, రామచంద్ర, హరి, విజయ్, అబ్దుల్‌రెహమాన్, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.


డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న మాలమహానాడు నాయకులు

గండి ఆలయ హుండీ లెక్కింపు

చక్రాయపేట, ఫిబ్రవరి 5: హుండీలోని కానుకల ద్వారా గండి ఆలయానికి రూ.14,05,372 ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. సోమవారం హుం డీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. అన్నదా నం హుండీ ద్వారా రూ.14,753 నగదు, 8.200 గ్రాముల బంగారం, 520.340 గ్రా ముల వెండి వచ్చినట్లు ముకుందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కావలి కృష్ణతేజ, పాలక మండలి సభ్యులు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఏపీజీబీ మేనేజర్ జనార్దన్, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఏపీజీబీ మేనేజర్ అశోక్‌కుమార్, పోలీసు సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, కళ్యాణకట్ట క్షురకులు పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల...

- బి.కొత్తకోటపై ఆర్టీసీ అధికారుల చిన్నచూపు
- పలు గ్రామీణసర్వీసులకు నష్టాల పేరుతో తిలోదకాలు
- బస్సుల్లేక ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 5: ఒకప్పుడు ఆర్టీసీ బస్సులతో కళకళలాడిన బి.కొత్తకోత నేడు బస్సుల కోసం వెంపర్లాడే పరిస్థితులు నెలకొన్నాయి. బి.కొత్తకోటలో ఆర్టీసీ డిపో ఉండి, పొరుగు మండలాలైన ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లెలలోని గ్రామాలతో పాటు, కర్ణాటక సరిహద్దు గ్రామాల మీదుగా పట్టణాలకు విరివిగా బస్సులను నడిపి ప్రజా రవాణాకు ఏమాత్రం ఇబ్బందిలేని పరిస్థితి ఒకప్పుడు ఉండేది. అయితే ఇప్పుడు అందుకు విరుద్ధంగా బస్సుల కోసం ప్రజలు వెంపర్లాడాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్టీసీ డిపో రద్దు చేసి 17 ఏళ్లు కావస్తోంది. అప్పట్నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తుండడంతో బయటి ప్రాంతాల నుంచి బి.కొత్తకోటకు రావాలన్నా, బి.కొత్తకోట నుంచి తమ గ్రామాలకు వెళ్లాలన్నా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

అరకొరగా ఉన్న డొక్కు బస్సులు

ఆర్టీసీ డిపో ఉన్నప్పుడు బి.కొత్తకోట కేంద్రంగా నడిచిన బస్సులలో సగానికి సగం తగ్గిపోయాయి. ఉన్న బస్సులు సైతం కళతప్పి గమ్యస్థానం చేరే వరకు నమ్మకం లేని డొక్కు బస్సులుగా తయారయ్యాయి. బి.కొత్తకోట నుంచి గౌనిపల్లె, కూరిగేపల్లె, బట్లపల్లె, తదితర గ్రామాల మీదుగా చింతామణి, బెంగళూరు, బాగేపల్లెలకు వెళ్లే అవకాశం సన్నగిల్లింది. పీటీఎం మండలంలోని టి.సదుం, కందుకూరు, బెట్టకొండ, కాట్నగల్లు తదితర గ్రామాలకు ప్రజా సౌకర్యం కోసం నడిపిన బస్సు సర్వీసులు రద్దు చేశారు. అన్ని మార్గాల్లోనూ ఉన్న ఒకటి, అర బస్సులు ఎప్పుడు వస్తాయో, ఒకవేళ బయలుదేరినా ఎక్కడ ఆగిపోతాయో తెలియక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో బస్సులు లేక ప్రైవేటు బస్సులు, ఆటోలపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడమే కాకుండా, ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండాపోతోంది.

ఇక్కడ కంట్రోలర్.. ఆర్టీసీ మెకానిక్

మదనపల్లె తరువాత స్థానంలో ఉన్న పట్టణం కావడం, పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ కావడంతో బి.కొత్తకోటకు ఆర్టీసీ అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. గ్రామాల నుంచి బి.కొత్తకోటకు, బి.కొత్తకోట నుంచి మదనపల్లె, చింతామణి, తిరుపతి, లాంటి పట్టణాలకు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యవసాయ అవసరాల కోసం రైతులు ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రయాణిస్తారు. వీరికి సరిపడా బస్సులు లేకపోయినప్పటికీ, బి.కొత్తకోట కేంద్రంగా ప్రస్తుతం నడుస్తున్న బస్సులను అజమాయిషి చేసేందుకు మదనపల్లె డిపో నుంచి ఓ కంట్రోలర్‌ను ఇక్కడ ఉంచేవారు. ప్రస్తుతం అతను కూడా లేకుండాపోయాడు. ఆర్టీసీలో తాత్కాలిక ఉద్యోగిగా ఉన్న ఓ మెకానిక్ అంతా తానే అన్నట్లు కంట్రోలర్ పాత్ర పోషిస్తున్నాడు.

మళ్లీ మాములు స్థితి ఎప్పుడొస్తుందో!

ఇంతకు మునుపు దూరప్రాంతాల నుంచి బి.కొత్తకోటకు కాస్త ఆలస్యంగా వచ్చినా తమ గ్రామాలకు చేరవచ్చుననే ధైర్యం ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సాయంత్రం అయిందంటే ఇక బస్సు లేనట్లే. ఆటోలకు రూ.300-400 అద్దె చెల్లించి పల్లెలకు చేరాల్సి వస్తోంది.

ఉదయం, సాయంత్రం విద్యార్థులు బి.కొత్తకోటకు రావడానికి, పోవడానికి పడుతున్న అవస్థలు చూస్తేగానీ అర్థం కాదు. పగలు సైతం సమయానికి బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి రావడంతో వారి వ్యాపారం బాగా సాగుతోంది. బి.కొత్తకోటలో ప్రజారవాణా సౌకర్యం ఎప్పుడు మెరుగుపడుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



బి.కొత్తకోట బస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు, బస్సు రాగానే సీట్ల కోసం విద్యార్థులు, ప్రయాణికుల అవస్థలు

బస్సు నుంచి జారిపడి వ్యక్తి మృతి


సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

రామసముద్రం, ఫిబ్రవరి 5: వేగంగా వెళ్తున్న బస్సులో డోర్ వద్ద నిలబడి ఉన్న ప్రయాణికుడు సుబ్రహ్మణ్యం ప్రమాదవశాత్తు కాలు జారి బస్సు నుంచి కిందకు పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు రామసముద్రం మండలం పెద్ద కురప్పల్లికు చెందిన బయ్యప్ప కుమారుడు సుబ్రహ్మణ్యం సొంత పనుల నిమిత్తం కర్ణాటక రాష్ట్రం ములబాగళ్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో ముళబాగల్ నుంచి రామసముద్రం వచ్చే ఓ ప్రైవేట్ బస్సులో రోడ్ దగ్గర నిలబడి ఉన్నారు. ఈక్రమంలో బస్సు ముళబాగల్ నుంచి వస్తుండగా సుబ్రహ్మణ్యం ప్రమాద వశాత్తు కిందపడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

రైలు నుంచి ... గుర్తుతెలియని వ్యక్తి మృతి

ములకలచెరువు, ఫిబ్రవరి 5: రైలులో నుంచి జారిపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు...మండలంలోని బురకాయలకోట సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండడంతో గమనించిన గొర్రెల కాపరులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు రైల్వే ట్రాక్ పక్క మృతదేహం పడి ఉండడంతో కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కదిరి రైల్వే ఎస్‌ఐ రహీం తమ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి వ్యక్తి మృతిపై విచారణ చేపట్టారు. గుర్తుతెలియని వ్యక్తి రైలులో నుంచి జారి పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తి వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, నల్లప్యాంటు, తెల్లషర్టు ధరించి ఉన్నాడని, కుటంబీకులు, బంధువులు గుర్తుపడితే తమను సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ములకలచెరువు, ఫిబ్రవరి 5: మండంలోని సోంపల్లె పంచాయతీ బిళ్యారివారిపల్లె సమీపంలో సోమవారం దాడులు నిర్వహించి ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి రూ.24,250లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా జూదాలు జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటాం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 5:అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త నాగయ్య కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ నాయకుడు కె.అమరనాథ్ పేర్కొన్నారు. మదనపల్లె మండలం గాండ్లపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త నాగయ్య సొంత పనిమీద హైదరాబాద్ వెళ్లి అక్కడ ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అమరనాథ్ నాగయ్య మృతదేహాన్ని స్వగ్రామం చేర్చడంలో సహాయం చేశారు. దీంతో పాటు ఆయన అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం తెలియజేశారు. నాగయ్య కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని, వారి ఇద్దరు కుమారులకు ఉద్యోగాలు వచ్చేలా తనవంతు కృషి చేస్తానన్నారు.

చేపల చెరువుల వేలం ద్వారా రూ.80వేలు ఆదాయం


చెరువులకు వేలం పాట నిర్వహిస్తున్న ఈవోపీఆర్‌డీ చలపతిరావు. తదితరులు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 5: చేపల చెరువుల వేలం ద్వారా తవళం పంచాయతికి రూ.80వేలు ఆదాయం సమకూరినట్లు ఈవోపీఆర్‌డీ చలపతిరావు తెలిపారు. సోమవారం తవళం పంచాయతి కార్యాలయలంలో వివిధ గ్రామాల్లోని 5చెరువులలో చేపలు పట్టుకొనేందుకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో యర్రంరెడ్డిచెరువును విశ్వనాథ్ రూ.30వేలకు పాడుకోగా, ఎగువచెరువును గురుప్రసాద్ రూ.16వేలకు గంగాసాగరవడ్డును హరినాథ్ రూ.16వేలకు, సాకిరేవుఒడ్డు శివకుమార్ రూ.18వేలకు దక్కించు కొన్నారు. అలాగే మరో చెరువును ఎవ్వరూ పాట పాడకపోవడంతో దేవర చెరువును అధికారులు వాయిదా వేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరమణారెడ్డి, .సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేలంలో రూ.39,600లు ఆదాయం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 5: వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల వేలం పాటలు నిర్వహించగా రూ.39,600లు ఆదాయం వచ్చినట్లు ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఎక్సైజ్ కేసులలో సీజ్ చేసిన ఓ క్వాలిస్ వాహనం వేలం నిర్వహించగా ఆదాయం వచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్పర్శ లేని మచ్చలు నిర్లక్ష్యం చేయవద్దు


చింతపర్తిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సుధాకర్

వాల్మీకిపురం, ఫిబ్రవరి 5: శరీరంపై స్పర్శ లేని మచ్చలను నిర్లక్ష్యం చేసి వ్యాధుల భారిన పడరాదని వాల్మీకిపురం మండలం చింతపర్తి పీహెచ్‌సీ హెల్త్ సూర్‌వైజర్ సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం స్పర్శ కుష్ఠు వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలను తెలియజేశారు. శుభ్రత, ఆరోగ్యజాగ్రత్తలు తీసుకోకపోవడం ద్వారా వచ్చే వ్యాధులను తెలియజేశారు. శరీరంపై వచ్చే స్పర్శ లేని మచ్చలు ఉన్నవారు ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకోవాలని గ్రామంలో ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈ పాఠవాల హెచ్‌ఎం సలీం, వైద్య సిబ్బంది షబానా, భానుబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

● వైసీపీ అరాచకపాలనను తరిమికొడదాం ● టీడీపీ-జనసేనను గెలిపిద్దాం ●మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్


తంబళ్లపల్లెలో జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ హయాంలోనే బీసీల అభ్యున్నతి జరిగిందని తంబళ్లపల్లె టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం తంబళ్లపల్లె మండల కేంద్రంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో శంకర్‌యాదవ్ మాట్లాడుతూ..మళ్లీ మంచి రోజులు రావాలంటే రాబోయే ఎన్నికల్లో వైసీపీ అరాచక పాలనను తరమికొట్టి తంబళ్లపల్లెలో టీడీపీ-జనసేన జెండా ఎగురవేయాలన్నారు. ఒక్కచాన్స్ అని అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు నియోజకవర్గ వ్యాప్తంగా విలువైన భూములు కాజేశారని, పాపాఘ్ని నదిలో కోట్లు విలువ చేసే ఇసుకను దోచేశారని ఆరోపించారు. ప్రస్తుత పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ప్రజల నుంచి లాక్కున్న భూములను తిరిగి ఇచ్చేయాలన్నారు. నాలుగున్నర ఏళ్ల వైసీపీ పాలనలో తనపై అనేక సార్లు దాడులు చేశారనీ కానీ ఎక్కడా భయపడలేదన్నారు. వెను కబడిన ప్రాంతమైన తంబళ్లపల్లెకు, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. గత టీడీపీ హయాంలో రూ.2వేల కోట్ల నిధులతో తంబళ్లపల్లెను ఎంతో అభివృద్ధి చేశానన్నారు. రాజంపేట టీడీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ..ఒక్క చాన్స్ అని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికలు చివరి చాన్స్ కావాలన్నారు. తంబళ్లపల్లె జనసేన ఇన్‌చార్జ్ సాయినాథ్ మాట్లాడుతూ.. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో అరాచకాలు, అక్రమాలు పెరిగిపోయాయన్నారు. ఎన్నికలు అతి దగ్గరలో ఉన్నాయని అందరం సమన్వయంతో పనిచేసి తంబళ్లపల్లెలో జనసేన-టీడీపీ గెలుపునకు కృషిచేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ.. బీసీలకు పెద్దపీట వేసింది టీడీపీనే అన్నారు. అంతకుముందు తంబళ్లపల్లెలో రాగిమాను కూడలి నుంచి ములకలచెరువు రోడ్డు లోని సభ వేదిక వరకు శంకర్‌యాదవ్ పెద్దఎత్తున టీడీపీ, జనసేన నాయకులతో కలసి ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు శివకుమార్, తెలుగుయువత నాయకులు నరసింహులు, రాజు, సోముశేఖర్, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు రామచంద్ర, చలపతినాయుడు, బేరిశీన, లక్ష్మీనారాయణ, వీరాంజినేయులు, కాలానారాయణ, శంకర్‌రెడ్డి, జనసేన నాయకులు ఎద్దుల నరసింహులు, నరేంద్రరెడ్డి, మురళి, సురేష్, సుబహాన్, మనసూర్ ఆరు మండలాల టీడీపీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె తహసీల్దార్‌గా రమాదేవి బాధ్యతలు స్వీకరణ


తహసీల్దార్ రామాదేవిని అభినందిస్తున్న సిబ్బంది

మదననల్లె అర్బన్, ఫిబ్రవరి 5: మదనపల్లె తహసీల్దార్‌గా రమాదేవి సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఈమె అనంతపురం జిల్లా నుంచి బదిలీపై మదనపల్లె వచ్చారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను ఉదయం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రెడ్డెప్ప, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమండ్యం తహసీల్దార్ గా లక్ష్మీనాయక్



పెద్దమండ్యం, ఫిబ్రవరి 5:: పెద్దమండ్యం మండల తహసీల్దార్ గా బి. లక్ష్మీనాయక్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన తహసీల్దార్ రాము కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పెద్దమండ్యం కొత్త తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చినట్లు వెల్లడించారు. డీటీలు రవీంద్ర నాయక్, గౌరిశంకర్, ఎఎస్‌వో ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

కలికిరికి విజయకుమారి నియామకం

కలికిరి, ఫిబ్రవరి 5: కలికిరి తహసీల్దారుగా నియామకమైన పి.విజయకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండల తహసీల్దారుగా పనిచేస్తూ కలికిరికి బదిలీ అయ్యారు. కాగా గత ఐదేళ్ళగా మండలానికి మహిళా తహసీల్దార్లు రావడం విశేషం.

పీటీఎంకు శ్రీరాములు..



పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 5 : పీటీఎం నూతన తహసీల్దార్‌గా సోమ వారం ఎస్పీ శ్రీరాములు బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా పీటీఎంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పని చేసిన విద్యాసాగర్‌ను డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించి ఇక్కడికి తహసీల్దార్‌గా అనం తపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం బొమ్మనహాళ్ మండలంలో పని చేస్తున్న ఎస్పీ శ్రీనివాసులు బధిలీపై సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎన్నికల నేపథ్యంలో బదిలీపై ఇక్కడకు పంపించారన్నారు.

బి.కొత్తకోటకు పుణ్యవతి నియామకం



బి.కొత్తకోట, ఫిబ్రవరి 5: బి.కొత్తకోట మండల తహసీల్దారుగా నియమితులైన పుణ్యవతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం కలెక్టరేట్‌లో కోఆర్డినేట్ సెక్షన్‌లో పని చేస్తూ, ఎన్నికల బదిలీల్లో బాగంగా ఆమె బి.కొత్తకోటకు తహసీల్దారుగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...బి.కొత్తకోటలో విధులు సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కాగా, ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన రఫీక్ అహ్మద్ మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు.

వాల్మీకిపురంకు ఖాతిజున్‌ఖుబ్రా



వాల్మీకిపురం, ఫిబ్రవరి 5: వాల్మీకిపురం మండల నూతన తహసీల్దార్‌గా ఖాతిజున్‌ఖుబ్రా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో ధర్మవరం డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉన్న ఆమె బదిలీపై వాల్మీకిపురంకు రాగా ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న ఫిరోజ్‌ఖాన్ తిరిగి డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా నూతన తహసీల్దార్ ఖాతిజున్‌ఖుబ్రా మాట్లాడుతూ నిత్యం అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరిస్తానన్నారు.

తంబళ్లపల్లెకు నూతన తహసీల్దారు, ఎస్‌ఐ నియామకం


బ్రహ్మయ్య తహసీల్దారు


ఎస్‌ఐ శివకుమార్

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 5: సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో బాగంగా తంబళ్లపల్లె మండలం నుంచి బదిలీ అయిన తహసీల్దారు, ఎస్‌ఐల స్థానంలో సోమవారం నూతనంగా తహసీల్దారు, ఎస్‌ఐలు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు అనంతపురం జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో అదే జిల్లాలో తహ సీల్దారుగా పనిచేస్తున్న బ్రహ్మయ్య ఇక్కడకు వచ్చారు. గతం లో ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి నిమ్మనపల్లెకు బదిలీ కాగా, ఆయన స్థానంలో గాలీవీడు ఎస్‌ఐగా పనిచేస్తున్న శివకుమార్ తంబళ్లపల్లెకు వచ్చారు.

కురబలకోట తహసీల్దార్‌గా ఈశ్వరమ్మ



కురబలకోట, ఫిబ్రవరి 5:కురబలకోట మండల తహసీల్దార్‌గా ఈశ్వరమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా పలువురి తహ సీల్దార్‌లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ భీమేశ్వరరావును కడప జిల్లా సింహాద్రిపు రానికి, అనంతపురం జిల్లా శింగనమల తహసీల్దార్‌గా పని చేస్తున్న ఈశ్వరమ్మను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో భూ సమస్యలను పరిష్కరిం చడంతో పాటుగా, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలను అందిస్తానన్నారు. అలాగే మండల పరిధిలో భూ సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

పీలేరు తహసీల్దారుగా మహబూబ్ బాషా



పీలేరు, ఫిబ్రవరి 5: పీలేరు తహసీల్దారుగా ఎస్.మహబూబ్ బాషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన బదిలీలలో భాగంగా అనంతపురం గుత్తి తహసీల్దారుగా పనిచేస్తున్న ఆయన పీలేరుకు వచ్చారు. పీలేరులో పనిచేస్తుండిన ధనంజయులు వైఎస్‌ఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

పెద్దమండ్యం కొత్త ఎస్‌ఐగా వెంకటేష్



పెద్దమండ్యం, ఫిబ్రవరి 5: పెద్దమండ్యం మండల కొత్త ఎస్‌ఐగా వెంకటేష్ సోమవారం పదవీ బాధ్యతలు చేట్టారు. రాయచోటి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన రామాంజనేయుడు రాయచోటి దిశ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పెద్దమండ్యం కొత్త ఎస్‌ఐ మాట్బాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలు పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. అపరచితుల సంచారం ఉంటే పోలీసులకు ప్రజలు సమాచారం అందజేయాలన్నారు.

రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే..


సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు శివకుమార్

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 5: రాబోయే ఎన్నికల్లో ప్రజాశీస్సులతో అధికారంలోకి రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు శివకుమార్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని ఎల్లప్పవారికోటలో వారి స్వగృహంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు తిరిగి మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల స్పందన చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోముశేఖర్, సిద్దమల్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గుర్రంకొండ, ఫిబ్రవరి 5:గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న గృహాలపై మాజీ సర్పంచ్ నౌషాద్ అహ్మద్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీలో 618 గృహాలను అప్పటి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఏర్పాటు చేశారన్నారు. ఇందులో భాగంగా ప్రజల అవసరాల కోసం గుడి, మసీదు, పాఠశాల, ఆసుపత్రి, పార్కు, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం ఖాళీ స్థలాన్ని ఉంచగా అధికార పార్టీ నాయకులు కబ్జా చేసి ప్లాట్‌లను వేసి లక్షలాది రూపాయలకు విక్రయించినట్లు కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే కాలనీలో గ్రీన్ ఏరియాలో కూడా కొందరు అక్రమ నిర్మాణాలు చేసినట్లు తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 5 : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, అనంతరం ఆలయంలో స్వామి వారిని సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆర్టీఐ యాక్టివిస్టులకు పోలీసుల సహకారం

కలికిరి, ఫిబ్రవరి 5: ఆర్టీఐ చట్టం కోసం పనిచేసే క్రియాశీలక కార్యకర్తలకు పోలీసుల వైపు నుంచి అన్ని విధాల సహకారం అందజేస్తామని కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరు ఆర్.మోహన్ హామీ ఇచ్చారు. స్థానిక ఆర్టీఐ సంస్థ ప్రతినిధులు కొత్తగా బాధ్యతలు చేపట్టిన మోహన్‌ను సోమవారం పోలీసు స్టేషన్‌లో కలిసి సత్కరించారు. ఆర్టీఐ సంస్థ ప్రతినిధులకు అన్ని విధాల అండగా వుంటామన్నారు. ఆర్టీఐ అవగాహనా సంస్థ ప్రచురించిన క్యాలెండరును మోహన్ ఆవిష్కరించారు. ఏఎస్‌ఐ మధుసూదనాచారి, ఆర్టీఐ సంస్థ ప్రతినిధులు శ్రీమన్నారాయణ రెడ్డి, రామకొండా రెడ్డి, వేణుగోపాల్, ప్రభాకర, మురళి, జ్ఞానేంద్ర, సతీష్‌కుమార్ రెడ్డి, సయ్యద్ బాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్వేషణ పోటీలలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ

కురబలకోట, ఫిబ్రవరి 5: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు అన్వేషణ పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. అగస్త్య సినోప్సిస్‌ల ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో అన్వేషణ-2024 పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో కళాశాల ద్వితీయ సంవత్సరం సీఎస్‌టీ విభాగానికి చెందిన బణుహీర్, అనికేత్ అరుణ్ సన్మాల్, అన్వర్ అలీఖాన్ ప్రాజెక్టుకు ప్రథమ బహుమతిని అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఈడీ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధి శ్రీదేవి అభినందించారు.

వాల్మీకి- బోయలను ఎస్టీగా గుర్తించాలి


మాట్లాడుతున్న వీఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పొదల నరసింహులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 5: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వాల్మీకి-బోయలను ఎస్టీ రిజర్వేషన్ తీర్మానం ప్రవేశపెట్టాలను వీఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పొదల నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఎస్టీ సాధనకు వాల్మీకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఐక్యంగా ఎస్టీసాధనకు కృషి చేయాలని నినాదాలు చేశారు. అంబేడ్కర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్‌నుంచి నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భందగా వాల్మీకి సంఘం నాయకుడు పొదల నరసింహులు మాట్లాడుతూ వాల్మీకి, బోయల ఎస్టీ సాధనకు నిర్విరామంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నేరవేర్చలేకుండగా పోయాయని విమర్శించారు. కార్యక్రమంలో మాలతి, కృష్ణమూర్తి, శంకర, గౌరమ్మ, సూరి, శ్రీరాములు, మల్లికార్జున, రామకృష్ణ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం


ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత

మదనపల్లె, ఫిబ్రవరి 5: మదనపల్లె పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. జనంకోసం జనసేన కార్యక్రమంలో భాగంగా సోమవారం 53వరోజు ఎన్‌టీఆర్ సర్కిల్, సొసైటీకాలనీ, పీఎన్‌టీ కాలనీలో ప్రాంతాల్లో ఇంటింటా పర్యటించారు. పట్టణంలోని తాగునీటి సమస్యతోపాటు పారిశుధ్యం అధ్వానంగా ఉందని విమర్శించారు. తమ పర్యటనలో ప్రజలు ఇవే సమస్యలు తమ దృష్టికి తెస్తున్నట్లు తెలిపారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో జనసేన-టీడీపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని, ఇలాంటి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. తల్లి, చెల్లిని ఆదరించని వాడు..ఇక రాష్ట్రాన్ని, ప్రజలను ఏం ఉద్ధరిస్తాడని విమర్శించారు. ఇందులోభాగంగా జనసేన కరపత్రాలను ఇంటింటా అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, సోను, కుప్పాల శంకర్, కోటకొండ చంద్రశేఖర్, సుప్రీంహర్ష, తుపాకుల ధరణి, యాసిన్, వెంకటేష్, సిద్దప్ప, చంద్రశేఖర్, పద్మావతమ్మ, ప్రభావతి, సుకన్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై తక్షణం స్పందించండి


సబ్‌కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 5: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆర్డీవో హరిప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ ఎల్-14 లేఅవుట్‌లో తాగునీటి బోరు మరమ్మతులకు గురై ఆరు నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఫిర్యాదు చేశారు. గుట్ట ప్రాంతం కావడంతో రోడ్లు లేక అవస్థలు పడుతున్నామని ప్రజలు విన్నవించారు. మదనపల్లెలో ఓ ప్రైవేటు కళాశాల యజమాన్యం విద్యార్థి సురేష్‌ను ఫీజులు చెల్లించలేదని బయటకు పంపేశారని, ఆ కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐ ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం పోతబోలు గ్రామం దిగువగాం డ్లపల్లెలో ఓ చింతచెట్టు కూలిపోయే స్థితిలో వుందని గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్డీవో హరిప్రసాద్ సెక్టోరియల్ అధికారులతో సమావేశమై, పోలింగ్ స్టేషన్‌ల స్థితిగతులపై విచారించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి


బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిరసనలు తెలుపుతున్న న్యాయవాదులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని మదనపల్లె బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంకు తాళంవేసి, నోటికి నల్ల రిబ్బను కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చట్టం వలన రైతులు, భూ యజమానులు తీవ్రంగా నష్టపోతారన్నారు. నాలుగు నెలలుగా న్యాయవాదులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు న్యాయబద్ధంగా వచ్చే ఆస్థిహక్కు మాయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, నరేంద్ర, గణపతి, శివకుమార్‌రెడ్డి, వెంకట్‌కుమార్, ప్రసాద్, శ్రీనివాసులు, లక్ష్మీకాంత్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి


కందుకూరులో ఓటర్ల సందేహాలను అడిగి తెలుసుకుంటున్న సెక్టార్ ఆఫీసర్ మధుబాబు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 5 : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పోలింగ్ సెక్టార్ ఆఫీసర్ మధుబాబు ఓటర్లను కోరారు. సోమవారం మండలంలోని కందుకూరు, వడ్డిపల్లె, పాతకందుకూరు, పట్టెంవాండ్లపల్లె, కమ్మచెరువు, మెరుసుపల్లె తదితర గ్రామాల పరిధిలో ఉన్న ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో పర్యటించారు. ఆయా పరిధిలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓటర్లను కలిసి వారితో మాట్లాడారు. రాబోవు ఎన్నికలు చాలా ప్రతిష్టాత్మకంగా ఉంటాయని, తమ ఓటు హక్కును ధైర్యంగా వేసుకోవచ్చన్నారు. పోలింగ్ స్టేషన్లలో భద్రత ఉందా? సురక్షితంగా ఉందా లేదా? తమకు పోలింగ్ స్టేషన్ అనువైనదా? కాదా వంటి వాటిపై ఓటర్ల అభిప్రాయాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదికను పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కందుకూరు విఆర్వో శ్రీరాములు తో పాటు బిఎల్వోలు ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

● ఆటో డ్రైవర్లకు పోలీసు ఇన్‌స్పెక్టర్ మోహన్ కౌన్సెలింగ్


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసు ఇన్‌స్పెక్టర్ మోహన్

కలికిరి, ఫిబ్రవరి 5: ఆటో డ్రైవర్లు తప్పని సరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని స్థానిక పోలీసు ఇన్‌స్పెక్టరు మోహన్ స్పష్టం చేశారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు స్టేషను ఆవరణలో సోమవారం స్థానిక ఆటో డ్రైవర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవింగ్, ఆటో లైసెన్సులను అం దుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. మద్యం తాగి గానీ అధిక వేగంతోగానీ ఆటో నడిపితే చట్టప్రకారం చర్యలుంటాయన్నారు. రేడియం స్టిక్కర్లను ఆటోకు అన్ని వైపులా అంటించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోడ్డు పక్కల ఎక్కడ పడితే అక్కడ ఆటోలను పార్కింగ్ చేయకూడదని హెచ్చరించారు. ప్రయాణికులతో ప్రధానంగా మహిళలతో దురుసుగా ప్రవర్తించరాదని మోహన్ వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మధుసూదనాచారి, హెచ్‌సీ మనోహర్, కలికిరి పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 5: వాల్మీకిపురం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం (బాలికలు) పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఆంగ్ల మాధ్యంలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్పన పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీన జరుగుతుందని, 5వ తరగతిలో ప్రవేశానికి 2023-24 విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. అన్నమయ్య, చిత్తూరు ఉమ్మడి జిల్లాలలో ఏ ప్రాంతంలోనైనా నివసించేవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2024 సంవత్సరంలో ప్రవేశాలకు ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థినులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు ఆన్లైన్ ద్వారా హెచ్‌టీటీ://ఏపీబీఆర్‌ఏజీసిఇటీ.ఏపీసా ఎఫ్‌ఎస్ ఎస్.ఇన్/ అనే వెబ్‌సైట్‌లో 23/02/2024లో ఆన్‌లైన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నెంబరు 7989128742, 8331823512లను సంప్రదించగలరని తెలిపారు.